


సోమశిలలో 11.424 టీఎంసీల నీరు

అనంతసాగరం, మార్చి 21: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి ప్రాజెక్టులో 11.424 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



రంజాన్ వేళలు ఇఫ్తార్ (శుక్రవారం) : 6.22 | సహరి (శనివారం) : 4.52

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 34.0 27.2 | కావలి : 33.0 24.0 | కందుకూరు : 34.0 24.0 | ఆత్మకూరు : 32.0 21.0 | ఉదయగిరి : 36.0 24.0



ప్రభుత్వ ముసుగు.. సేవలో లొసుగు


ఈ చిత్రంలో కనిపిస్తున్న కారు వెనుక భాగాన్ని గమనించండి. ఎరుపు రంగులో 'గవర్నమెంట్ వెహికల్' అని రాసి ఉంది. అంటే ప్రభుత్వ వాహనం అన్నమట. దాని వెనుకే ఉన్న వైసీపీ ప్రచార రథాన్నీ గమనించండి. 'కోడ్' కూసిన వేళ. ఆ కారు అధికార పార్టీ నాయకుల వద్ద ఎందుకు ఉందో ఎవరికీ అంతు చిక్కని ప్రశ్నగా మారింది. 'విజయీభవ' పేరుతో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేస్తున్న ప్రచార కార్యక్రమాల్లో సదరు కారు కూడా తిరుగుతోంది. నాయకులకు, కార్యకర్తలకు అవసరమైన మంచినీళ్ల సీసాలు, టిఫిన్ వంటివి ఈ కారులోనే సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ వాహనం పేరుతో నడుస్తున్న కారులో ఎవరున్నారో.. అధికార పార్టీ సేవలో ఎందుకు తరిస్తున్నారో మాత్రం అంతుపట్టడం లేదు.

- మర్రిపాడు

పోలీసులు వేధిస్తున్నారా..

అయితే ఫిర్యాదు చేయండి!

ప్రజలకు అండగా నిలవాల్సిన పోలీసులే ఇబ్బందులు పెడుతున్నారా!? ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే ఇబ్బందులు పడతామేమోనన్న భయంతో జంకుతున్నారా!? ఇప్పుడు ఆ భయం అవసరం లేదు. పోలీసుల ద్వారా బాధించబడిన వారి కోసం పోలీస్ ఫిర్యాదుల ప్రాధికార సంస్థ ఏర్పడింది. గుంటూరు కేంద్రంగా నెల్లూరుజిల్లాతో పాటు మరో మూడు జిల్లాలకు చెందిన పోలీసులపై ఫిర్యాదులను స్వీకరించే సంస్థ ఇది. బాధితులు నేరుగా సదరు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు. పూర్తి వివరాలకు 9849818351 నెంబరును సంప్రదించాలి.



నెల్లూరు (క్రైం) : దేశ అత్యున్నత న్యాయస్థానం 2006లో ప్రకాష్ సింగ్ కేసులో ఇచ్చిన చారిత్రాత్మకపు తీర్పు అనుసరించి పోలీసులపై వచ్చే ఫిర్యాదులను విచారించడానికి పోలీస్ ఫిర్యాదుల ప్రాతికార సంస్థల ను ప్రారంభించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పోలీస్ ప్రాధికార సంస్థలను ఏర్పాటు చేశారు. గుంటూరు ప్రధాన కేంద్రంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. గుంటూరు కాజా టోల్ గేట్ సమీపంలో లాస్య రెసిడెన్సీ-2లోని 106, 107 ఫ్లాట్ నెంబర్లలో ఇటీవల ఈ సంస్థ ప్రారంభమైంది. చైర్మన్‌తోపాటు ముగ్గురు సభ్యులు ఉంటారు. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకు వచ్చిన ఫిర్యాదులపై విచారిస్తారు.

● **ఈ ఫిర్యాదులపై విచారణ**

పోలీస్ కస్టడీలో జరిగే మరణాలు, లైంగిక దాడు లు, తీవ్రమైన గాయాలు కావడం, పోలీసులచే బల వంతపు వసూళ్లు, పోలీసులతో ఇళ్లు, భూ ఆక్రమ ణ, పోలీస్ అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగ పరచడం వంటి ఫిర్యాదులపై విచారిస్తారు.

● **తీసుకోని ఫిర్యాదులు**

అస్పష్టమైన, ఆకాశరామన్న ఫిర్యాదులు, చదవడానికి వీలులేని చేతిరాత, అప్రాధాన్యతగల ఫిర్యాదులు స్వీకరించరు. సర్వీసు విషయాలు, కార్మికులు, పారిశ్రామిక వివాదాలతో పాటు కోర్టులు, ట్రిబ్యునల్‌లో ఉన్న అంశాలపై ఫిర్యాదులు స్వీకరించరు.





కావలి : ఆముదాలదిన్నెలో వైసీపీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న వలంటీరు

ఎవరేమన్నా.. మాకేం!

● **వైసీపీ సేవలో తరిస్తున్న వలంటీర్లు**

అనంతసాగరం : పలువురు వలంటీర్లు స్వామి భక్తి చాటుతూ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. బొమ్మవరం పంచాయతీ గోగులపల్లికి చెందిన వలంటీరు విజయ్ తన మొబైల్ స్టేటస్‌లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నట్లు గురువారం అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో ప్రత్యేక బృందం వలంటీరు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారిస్తోంది. అలాగే చిలకలమర్రికి చెందిన మరో వలంటీరు నెల్లూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. ఈ ఇద్దరు వలంటీర్లపై అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది.

● **కావలి రూరల్/ఏఎస్‌పేట :** కావలి మండలం ఆముదాలదిన్నెలో సర్పంచ్ ఊడా బ్రహ్మానందం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన ప్రచారంలో వలంటీరు తాతా ప్రవీణ్ పాల్గొన్నా రు. దీనిని గుర్తించిన టీడీపీ, జనసేన నాయకు లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎస్ పేట మండలం చౌటభీమవరంలో ఇటీవల జరిగిన వైసీపీ ప్రచారంలో ఈ రేషన్ డీలర్ పాల్గొనడంపై పలు వురు విమర్శిస్తున్నారు.

అనంతసాగరం : వలంటీరు సెల్ ఫోన్‌లోని సమాచారం

ప్రసన్నుడికి హనుమంతసేవ



బిట్రగుంట, మార్చి 21: బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారికి హనుమంత వాహన సేవ నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కర్పూరహారతులు సమర్పించారు. ఉభయకర్తలకు ఈవో రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కావలి పాతూరుకు చెందిన జనిగర్ల మహేంద్రయాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కాగా స్వామివారికి శుక్రవారం రాత్రి గరుడసేవ నిర్వహించనున్నారు.

దేవతలారా దిగిరండి!

● ధ్వజముపై ఎగిరిన గరుడ పటం
● వైభవంగా రంగడి బ్రహ్మోత్సవాలు



శేషవాహనంలో రంగనాథుడు



రంగనాథస్వామి ఆలయంలో ధ్వజారోహణం

తల్పగిరీశుడైన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ గురువారం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద మంత్రాలతో ధ్వజ స్తంభానికి గరుడ పటాన్ని ఎగురవేశారు. గరుడాళ్వారుకు నైవేద్యంగా పెట్టిన కొడిముద్దల కోసం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం విశేష పూలంగిసేవ, ప్రత్యేక పూజలు జరి గాయి. రాత్రి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఉభయ కర్తలు, ఈవో సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

పెంచలకోనకు

నేడు చంద్రబాబు

● నృసింహుడిని దర్శించుకోనున్న టీడీపీ అధినేత

రాపూరు (డక్కిలి), మార్చి 21 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచకొనలో లక్ష్మీనృసింహుడిని దర్శించుకోనున్నారు. ఈ మేరకు క్షేత్రంలో టీడీపీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి హెలి కాప్టర్‌లో చంద్ర బాబు బయలుదేరి 3.15 గంటలకు గోనెపల్లికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన పెంచలకోనకు చేరుకుని, లక్ష్మీనృసింహుడిని దర్శనం చేసుకుం టారు. తిరిగి సాయంత్రం 4.30 గంటలకు గోనెపల్లికు చేరుకుని హెలికా ప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళతారు. చంద్రబాబు పర్యటన గురించి తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గోనుపల్లికి చేరుకొని హెలిప్యాడ్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయం వద్ద దర్శన ఏర్పాట్లు చేయిస్తున్నారు.



గోనుపల్లి వద్ద హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల

పేరుకే లస్కర్... చేసేవన్నీ లాలూచీలే!

● 'ఇరిగేషన్'లో ఓ ఔట్‌సోర్సింగ్ లస్కర్ హవా
● ఏ ఎస్టిమేషన్ అయినా ఆయన కనుసన్నల్లోనే
● చేతిలో కీలకమైన సీఎఫ్‌ఎంఎస్ లాగిన్లు
● అందరికీ తెలుసు.. కానీ ఎవరూ పట్టించుకోరు..!

నెల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల శాఖలో ఆ వ్యక్తి పేరు తెలియని వారంటూ ఉండరు. చిన్న కాంట్రాక్టర్ నుంచి స్పెషల్ క్లాస్ కాంట్రాక్టరు వరకు ఆయన సుపరిచితుడు. ఆయనేమైనా ఎస్‌ఈ లేదా ఈఈ నా అంటే కాదు.. ఆయనో సాధారణ లస్కర్. ఏడాదిలో ఐదు నెలల పాటు రోజువారీ దినసరి వేతనం కింద పని చేస్తారు. కానీ ఏడాదంతా ఇరిగేషన్ శాఖలోని కీలకమైన టెక్నికల్ విభాగం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పదేళ్లుగా నెల్లూరు సెంట్రల్ డివిజన్‌లో లస్కర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం లస్కర్లను తొలగించినా ఈయన మాత్రం రోజూ ప్రభుత్వ అధికారిలా కార్యాలయానికి వస్తుంటారు. పేపర్‌పై ఏదో కాలువ కింద లస్కర్‌గా చూపించినప్పటికీ సెంట్రల్ డివిజన్ కార్యాలయంలో పని చేస్తుంటారు. రూ.40 లక్షల్లోపు వర్కులన్నీ డివిజన్ స్థాయిలో టెండర్లు పిలుస్తుంటారు. ఈ వర్కులకు హెడ్ డ్రాఫ్ట్‌మెన్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు (జేటీవో) ఎస్టిమేషన్లు తయారు చేయాలి. ఆ తర్వాత ఇంజనీర్లకు పంపి అనుమతులు తీసుకోవాలి. ఆ వర్కులను ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించాలి. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా జరగాల్సి ఉంది. అలానే వర్క్ పూర్తి చేశాక బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదంతా టెక్నికల్ విభాగం చేయాల్సిన పని. హెచ్‌డీలు, జేటీవోలు చేయాల్సిన పనులను అవుట్‌సోర్సింగ్ లస్కర్‌కు అప్పగించారు. సెంట్రల్ డివిజన్, కావలి, ఆత్మకూరు, డ్రైనేజీ, గూడూరు డివిజన్లలో ఏ ఎస్టిమేషన్ తయారు చేయాలన్నా ఆ బాధ్యతలను ఈ లస్కర్‌కే అప్పగిస్తున్నారని ఇరిగేషన్ శాఖలో చెప్పుకుంటున్నారు. కీలకమైన అధికారుల సీఎఫ్‌ఎంఎస్ లాగిన్లను కూడా ఈ వ్యక్తే ఆపరేటర్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



● **బావమరిది పేరుతో వర్కులు**

బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులు చేయాల్సిన పనులను బాధ్యత లేని ఓ ప్రైవేటు వ్యక్తికి ఎలా అప్పగిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అందులోనూ రూ.కోట్ల ప్రజాధనంతో కూడుకున్న పనులను ఇతరులు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రక్రియలో ఏదైనా తప్పు జరిగితే ఎవరు బాధ్యత తీసుకోవాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా సదరు లస్కర్‌కు టెక్నికల్ బాధ్యతలు అప్పగించడంతో వచ్చిందే అవకాశంగా ఆ లస్కర్ సొంత ప్రయోజనాలకు తెరలేపారు. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు సదరు లస్కర్ చేతులు తడపనిదే ఎస్టిమేషన్లు తయారు చేయడం, బిల్లులు అప్‌లోడ్ చేయడం జరగదని చెప్పుకుంటున్నారు. ఇక టెక్నికల్ బాధ్యతలన్నీ తన కనుసన్నల్లో జరుగుతుండడంతో సదరు లస్కర్ తన బావమరిది పేరుతో ఓ కాంట్రాక్ట్ లైసెన్స్‌ను తీసుకున్నారు. బావమరిది పేరుతోనే ఈ లస్కరే టెండర్లు వేయడం, ఆ పనులను ఇతరులకు పర్సంటేజీలు తీసుకొని రాష్ట్ర ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్క ఎఫ్‌డీఆర్ పనుల్లోనే సమారు వంద వర్కులు బావమరిది పేరుతో తీసుకొని ఇప్పటికే 90 వర్కులకు బిల్లులు కూడా పొందారని అందులో స్పష్టం చేశారు. ఈ విధంగా సదరు అవుట్‌సోర్సింగ్ లస్కర్ రూ.కోట్లు సంపాదించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రైవేటు వ్యక్తికి కీలకమైన టెక్నికల్ పనులు అప్పగించడం తప్పు అని ఇరిగేషన్ ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ వారెవరూ పట్టించుకోకపోవడం చూస్తుంటే అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ అవుట్‌సోర్సింగ్ లస్కర్ వ్యవహారంపై సెంట్రల్ డివిజన్ అధికారులను సంప్రదించగా తాము రాక ముందు నుంచీ సదరు లస్కర్ పనిచేస్తున్నారని, అన్నీ తెలిసీ మళ్లీ మమ్మల్ని అడుగుతున్నారా.. అంటూ సమాధానం ఇవ్వడం గమనార్హం.



పొదలకూరు మండలంలో 21 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయించగా ఇందులో 16 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఐదింటిలో అసలు నిర్మాణాలే ప్రారంభం కాలేదు

మనుబోలు మండలంలో 13 క్లినిక్‌లకు అనుమతులు వచ్చాయి. అయితే ఇక్కడా 7 మాత్రమే నిర్మాణాలకు నోచుకోగా 6 నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు.

కావలి రూరల్ మండలంలో 14 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రెండేళ్లు పూర్తయినా నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయి. కేవలం ఐదు చోట్ల మాత్రమే నిర్మాణాలు పూర్తికావస్తుండగా మిగిలిన 9 చోట్ల పునాదుల స్థాయిలోనే నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి పరిశీలన

నత్తేనయం!

శ్మశానంలో నిర్మాణం

వలేటివారిపాలెం మండలం నూకవరంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను స్మశానంలో నిర్మించారు. ఈ కేంద్రం పక్కనే మృతదేహాలను పూడ్చిపెడుతుండటంతో వైద్యసేవల కోసం ఎవరూ ఇటువైపు రావడం లేదు. మండలంలో 14 క్లినిక్‌లు మంజూరవగా 9 కేంద్రాల నిర్మాణం పూర్తయ్యాయి. నిధులు లేకపోవడంతో ఐదు కేంద్రాలు మాత్రం నిర్మాణ దశలోనే ఉన్నాయి. అందులో నూకవరంలోని హెల్త్ క్లినిక్ కేంద్రం కూడా ఒకటి. ప్రభుత్వ స్థలం లేకుంటే ప్రైవేట్ స్థలం కొనుగోలు చేసి క్లినిక్ నిర్మించాలి. అయితే, అధికారులు అనాలోచిత నిర్ణయంతో స్మశానంలో క్లినిక్ నిర్మించడ మేమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

- వలేటివారిపాళెం

జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల తీరిది. రెండేళ్లు గడుస్తున్నా నత్తేనయం అనేలా నిర్మాణాలు సా..గుతూనే ఉన్నాయి. సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవటం, పంచాయతీలలో స్థల కేటాయింపులో చొరవ చూపక పోవటం తదితర కారణాలతో ఈ పరిస్థితి దాపురించింది. ఆయా నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా రూ.84 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా నేటికీ నిర్మాణాలు పునాదుల దశ దాటలేదు.



సైదాపురం : అనంతమడుగులో పునాది దశలో ఆగిపోయిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

నెల్లూరు (వైద్యం), మార్చి 21 : గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం 2015లో మొహల్లా క్లినిక్‌లను అందుబాటులో తెచ్చింది. 212 రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలతోపాటు 109 రకాల మందులను అందుబాటులో ఉంచారు. ఈ క్లినిక్‌లు ప్రజాదరణ పొందటంతో ఆ తరహా విలేజ్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి రెండువేల జనాభాకు ఒక క్లినిక్‌ను ఏర్పాటు చేయాలని 2022, మార్చిలో ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మూడు గదుల నిర్మాణంతో ఈ క్లినిక్‌లు నిర్మించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా ఆరోగ్య కేంద్రాలలో బీఎస్సీ నర్సింగ్ చేసిన ఉద్యోగి ఓ ఏఎన్ఎంతోపాటు 54 రకాల మందులను అందుబాటులో ఉంచుకునేలా మార్గ దర్శకాలు చేశారు. చిన్న చిన్న వ్యాధులకు ఊడా ఇక్కడే చికిత్స అందిస్తారు. ఏవైనా అత్యవసర కేసులు వస్తే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా ఆసుపత్రులకు సిఫారసు చేస్తారు. పీహెచ్‌సీలకు అనుబంధంగా ఈ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు పని చేయనున్నాయి.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గ్రహణం
497 క్లినిక్‌ల నిర్మాణానికి రూ.84 కోట్ల కేటాయింపు
నిధుల భయంతో ముందుకు రాని కాంట్రాక్టర్లు
అక్కడక్కడా చేపట్టినా మంజూరుకాని బిల్లులు
అర్ధంతరంగా ఆగిపోయిన పనులు
ఇప్పటిదాకా పూర్తయినవి 130 మాత్రమే

వరికుంటపాడు : కాంచెరువులో గోడల దశలోనే..



● **అందుబాటులో నిధుల్లే.. కాంట్రాక్టర్లు రాక..!**

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గ్రహణం పట్టింది. జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల కేంద్రాల నిర్మాణాలకు కాంట్రా క్టర్లు రాకపోవటంతో పునాదుల దశలోనే నిలిచి పోయాయి. మరి కొందరు ముందుకు వచ్చినా కట్టిన వాటికి బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాలలో స్థానిక నాయకులే కాంట్రాక్టర్ల అవతార మెత్తి క్లినిక్‌ల నిర్మాణానికి ముందుకు వచ్చినా నిధుల గండంతో మధ్యలోనే పనులు ఆగిపోయాయి. ప్రస్తు తం ఎన్నికల సీజన్ కావటంతో ఇప్పట్లో పనులు కూడా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో మొత్తం 497 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కట్టాలని ప్రభు త్వం నిర్ణయించి, రూ.85 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో క్లినిక్ నిర్మాణానికి రూ.17 లక్షలు ఖర్చయ్యేలా నిర్ణయించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద 50 శాతం, వైద్య శాఖ మరో 50 శాతం నిధుల భాగస్వామ్యంతో విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. రెండేళ్ల క్రితం ఈ నిర్మాణాలను ప్రారంభించగా కేవలం 140 క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 82 క్లినిక్‌లు వివిధ నిర్మాణ దశలోనే ఉన్నాయి. మిగిలిన 275 క్లినిక్‌ల నిర్మాణాలు బేస్‌మెంట్ దశలోనే ఉన్నాయి. కట్టిన నిర్మాణాలకు రూ.24 కోట్లు విడుదల చేశారు. అయితే మిగిలిన నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో అధికారులు చెప్పలేకున్నారు.



మనుబోలు : చెర్లోపల్లిలో పునాదుల దశదాటని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



బుచ్చిరెడ్డిపాళెం : కాలయకాగొల్లులో నిర్మాణంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్



సంగంలో పునాదుల స్థాయిలోనే ఉన్న హెల్త్ క్లినిక్

మద్దతు ధర కన్నా బయటే ఎక్కువ!

- జిల్లాలో 8.11 లక్షల టన్నుల వరి ఉత్పత్తి
- ఎంత ధాన్యం సేకరణకైనా సిద్ధంగా అధికారులు
- ఆసక్తి చూపని అన్నదాతలు • ఇంకా బోణి చేయని ఆర్బీకేలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెల

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించినా, వాటిలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కన్నా, బయట మార్కెట్‌లో అధిక ధర లభిస్తుండటంతో అన్నదాతలు అటువైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ధాన్యం సేకరణ విషయంలో ఇంకా బోణి కొట్టలేదు.



కొండాపురం మండలంలో ధాన్యపు రాశులు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 21 : జిల్లాలో 2.60లక్షల ఎకరాల్లో మొదటి పంట(రబీ) వేశారు. ఆర్‌ఎన్‌ఆర్-15048, ఆర్‌ఎన్‌ఆర్ -31479, కేఎన్‌ఎం -1638, బీపీటీ-5204, ఎన్‌ఎల్‌ఆర్-34449 రకాలను పండించారు. ఏఏ మండలాల్లో ధాన్యం కోతకు వస్తోంది, ఎక్కడెక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే లెక్కలతో అధికారులు క్షేత్ర పర్యటన చేసి వివరాలు సేకరించారు. 8.11 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. 630 ఆర్బీకేలలో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశారు. తేమ యంత్రాలు, గోతాలను కూడా అందుబాటులో ఉంచారు. రైతులు తీసుకొచ్చే ఎంత ధాన్యాన్నైనా కొంటామని చెబుతున్నారు. కానీ బహిరంగ విపణిలో అధిక ధర దక్కుతుండటంతో రైతులు రాక కొనుగోలు కేంద్రాలు వెలవెల బోతున్నాయి. ఇదిలా ఉండగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కూడా ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు.. ధాన్యం కొనుగోళ్లకు ఆ సంఘాలు కూడా వేచి చూస్తున్నాయి.

తేమ సమస్య

తేమ శాతం ధాన్యం అమ్ముకోడానికి రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. ప్రైవేటు వ్యక్తులు తేమ శాతంతో సంబంధం లేకుండా టన్నుకు 100 కేజీలు ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నట్లు సమాచారం. అదే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అయితే తేమ శాతం తదితరాలు లెక్కకట్టి టన్ను మీద అదనంగా 150 నుంచి 200 కేజీల వరకు ధాన్యాన్ని తీసుకుంటారని రైతులు ఆరోపిస్తున్నారు. తేమ 17 శాతం లోపే ఉంటే టన్నుకు పూర్తి ధరను రైతులకు చెల్లించాలి. 17 నుంచి 20 శాతం వరకు ఉన్నా పూర్తి ధర చెల్లించాలని రైతులు కోరినా ఫలితం దక్కలేదు.

బయట మార్కెట్‌లో అధికంగా....

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్-ఏ రకం ధాన్యం పుట్టికి రూ. 18,725.50, సాధారణ రకానికి రూ.18555.50 ఇవ్వనున్నారు. అయితే బయట మార్కెట్‌లో బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్ రకాలకు ఇంకా మంచి ధర లభిస్తోంది. ఆర్‌ఎన్‌ఆర్-15048 రకానికి పుట్టికి రూ.23వేల నుంచి రూ.24వేల వరకు ధర ఉంది. ఆర్‌ఎన్‌ఆర్-31479 రకం రూ.22వేల నుంచి రూ. 23వేల వరకు పలుకుతోంది. కేఎన్‌ఎం-1638 రకానికి కూడా పుట్టికి రూ.22 వేల నుంచి రూ.23వేల వరకు ధర ఉంది. బీపీటీ-5204 రకానికి పుట్టికి రూ.23వేలు, ఎన్‌ఎల్‌ఆర్-34449 రకానికి రూ.19వేల నుంచి రూ.20వేల వరకు ఇస్తున్నట్లు సమాచారం. దీనికితోడు కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తుండటం, గోతాలు, వాటిలో ధాన్యం నింపుకునే పనులు ప్రైవేటు వ్యక్తులే చేస్తుండటంతో ఖర్చులు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో వడ్లను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతున్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం



రైతులు పండించిన ధాన్యాన్ని కొనడానికి సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో మొత్తం 630 ఆర్బీకేలు ఉన్నాయి. అన్నింటిలో కొనుగోలుకు ఏర్పాట్లు చేశాం. రైతులు బయట మార్కెట్‌లో ధర తక్కువగా ఉందని భావిస్తే ఆర్బీకేలలో మద్దతు ధరకు అమ్ముకోవచ్చు.

- ఎల్ లక్ష్మీనరసింహారావు, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్

బయట వ్యక్తులకు జాగ్రత్తగా అమ్ముకోవాలి



రైతులు పండించిన ధాన్యానికి బయట మార్కెట్‌లో ధర బాగుంది. తేమశాతం సమస్య లేకుండా అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. అయితే రైతులు ధాన్యాన్ని జాగ్రత్తగా అమ్ముకోవాలి. కొందరు అప్పులకు అధిక ధర ఇస్తామని ధాన్యం కొనుగోలు చేస్తారు. కానీ డబ్బును తిరిగి ఇవ్వకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు. అప్పుకు కాకుండా నేరుగా నగదు ఇచ్చిన వారికే ధాన్యాన్ని విక్రయించడం మంచిది.

- చిరసాని కోటిరెడ్డి, జిల్లా రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు

ఖర్చులకు లెక్కలేవి!?



- దోమల నివారణకు రూ.9 లక్షలా!? ఎక్కడ ఖర్చయ్యింది!
- జంతువుల నివారణ, కుక్కలకు చికిత్సకు రూ.61 లక్షలా?
- బడ్జెట్ సమావేశంలో కార్పొరేటర్ల ప్రశ్న
- నేటికీ సమాధానం ఇవ్వని కార్పొరేషన్ అధికారులు

నగరంలో దోమలను నివారించేందుకు ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్ యంత్రాల్లో ఆయిల్‌కు రూ.5 లక్షలు, ఫాగింగ్ యంత్రాల ఆయిల్‌కు రూ.4 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు లెక్కల్లో చూపారు. రోడ్లపై జంతవులను నిలువరించినందుకు రూ.26 లక్షలు, కుక్కలకు చికిత్సతో పాటు కు.ని ఆపరేషన్లు చేయించినందుకు మరో రూ.35 లక్షలు ఖర్చయిందని బడ్జెట్‌లో చూపుతూ ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో అధికారులు ఖర్చుల్లో లెక్కగట్టారు. దీనిపై అభ్యంతరం తెలిపిన కార్పొరేటర్లు కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతూ వాటికి లెక్కలడిగారు. కానీ ఇప్పటికీ యంత్రాంగం సమాధానం చెప్పకపోవడం గమనార్హం.

నెల్లూరు(సిటీ), మార్చి 21 : గడిచిన కొన్ని నెలలుగా నెల్లూరులో దోమల వ్యాప్తి పెచ్చుమీరింది. సాయంత్రం అయితే చాలు గుయ్.. మంటూ ప్రజలపై ప్రత్యక్ష దాడులకు పాల్పడుతున్న దోమలు అనేక రోగాలకు కారణమయ్యాయి. పొద్దువాలిందంటే వీధుల్లోని నగర వాసులు ఇళ్లలోకి పరుగులు తీస్తున్నారు. ఇది వాస్తవ పరిస్థితి కాగ ఇలా వ్యాప్తి చెందిన దోమలను ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్ యంత్రాల ద్వారా కట్టడి చేశామని అందుకు ఆయిల్ తదితర ఖర్చులు రూ.5 లక్షలు, ఫాగింగ్ యంత్రాలతో పొగపెట్టి వ్యాప్తిని అడ్డుకున్నామని అందుకు మరో రూ.4 లక్షలు ఖర్చయిందని కార్పొరేషన్ అధికారులు బడ్జెట్‌లో లెక్కలు చూపారు. వీటికి గతేడాది బడ్జెట్‌లో రూ. 35 లక్షలు కేటాయించగా తాము కేవలం రూ. 9 లక్షలతోనే సరిపెట్టినట్లు ఊరటనిచ్చారు. మరోవైపు నగరంలోని రోడ్లపై నిత్యం ప్రజలను, వాహనదారులను ఇబ్బంది పెట్టే పశువులను నిలువరించినందుకు గతేడాది బడ్జెట్‌లో రూ.20 లక్షలు కేటాయించగా రూ.26 లక్షలు ఖర్చయినట్లు లెక్క గట్టారు. ఇకపోతే వీధుల్లోని కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చికిత్సకు రూ.40 లక్షలు కేటాయించగా అందులో రూ.35 లక్షలు ఖర్చుచేసినట్లు తేల్చారు.

ఎక్కడెక్కడ ఖర్చు పెట్టారో చెప్పండి

ఈ లెక్కలన్నీ బయటకు రాగానే బడ్జెట్ సమావేశంలో కార్పోరేటర్లు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. తమ డివిజన్లలో రూపాయి కూడా ఖర్చు చేసి చర్యలు తీసుకోలేదని, స్వచ్ఛంద సంస్థలతా తామే ఖర్చు చేయించామని కార్పోరేటర్లు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఇలా 54 మంది కార్పోరేటర్లు ఒక గొంతుకతో ప్రశ్నించగా ఈ నిధులన్నీ ఏ డివిజన్లో, ఎంత ఖర్చు పెట్టారో లెక్క చెప్పాలని పట్టుబట్టారు. ఇలా 22 రోజుల క్రితం సమావేశంలో అడిగిన ప్రశ్నలకు నేటికీ కార్పోరేషన్ అధికారులు సమాధానం ఇవ్వకపోవడం విశేషం. రూ. లక్షల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టామని అధికారులు పక్కాగా లెక్కల్లో చూపి వాటికి ఆధారాలు ఇవ్వమని అడిగితే కనీసం వారి నుంచి స్పందన కరువైందని కార్పోరేటర్లు వాపోతున్నారు.

ఇంట్లో వైద్యుడి మృతి

- తీవ్ర దుర్గంధంతో వెలుగు చూసిన వైనం

నెల్లూరు(క్రైం), మార్చి 21: ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఓ వైద్యుడు మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ఇనుమడుగుకు చెందిన డాక్టర్ ఎన్ ప్రభాకర్‌రెడ్డి(80) చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఆయనకు భార్య డాక్టర్ కుసుమ, ఇద్దరు కుమార్తెలు ఉన్నాయి. కుమార్తెలిద్దరికీ వివాహమై యూఎస్‌ఏలో ఉంటున్నా రు. ప్రభాకర్‌రెడ్డి దంపతులు వైద్యులు కావడంతో ఉద్యోగరీత్యా ఎక్కువ కాలం విదేశాల్లోనే గడిపారు. ప్రస్తుతం ఆయన ఒంటిరిగా నెల్లూరులో ఉంటుండగా భార్య కుసుమ అమెరికాలో ని పిల్లల వద్ద ఉంటూ అప్పుడప్పుడు నెల్లూరు వచ్చి వెళుతుంటారు. కొంతకాలంగా ప్రభాకర్ రెడ్డి కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన నివసిస్తున్న ఫ్లాట్ నుంచి దుర్గంధం వస్తుండటంతో అపార్ట్‌మెంట్ వాసులు అతని భార్యతోపాటు బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ విజయ్‌శ్రీనివాస్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టారు. లోనికి వెళ్లి చూడగా ప్రభాకర్ రెడ్డి మృతిచెంది ఉన్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉండటాన్ని బట్టి ఆయన రెండురోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రభాకర్‌రెడ్డి సమీప బంధువు రాజగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ తదితరులు

కావలి, మార్చి21: కావలిలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలోనూ, నాయుడుపేట ఆయిల్ దుకాణంలోనూ చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 17 సెల్‌ఫోన్లు, 2 బ్లూటూత్‌లు, ఓ కెమెరా, మూడు 15 లీటర్ల ఆయిల్ టిన్లు, 32 పామాయిల్ లీటర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని కావలి డీఎస్పీ ఎం. వెంకటరమణ, సీఐ రాజేష్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలానికి చెందిన యనమల సూర్యతేజ, కోట మండలానికి చెందిన చిట్టేటి వినయ్‌కుమార్, గూడూరుకి చెందిన నాగేండ్ల శ్రీహరిలను 2023లో ఎర్రచందనం కేసులో రైల్వేకోడూరు టాస్క్‌ఫోర్స్ వారు అరెస్ట్ చేసి శ్రీకాళహస్తి జైలుకు పంపారు. అక్కడ వారికి గుంటూరుకి చెందిన నాగరాజు, చిత్తూరుకి చెందిన మీర్దావలి అనే పాత నేరస్థులు పరిచయం అయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చాక వారంతా కలిసి చోరీలకు పాల్పడేందుకు పథకం పన్నారు. నాగేండ్ల శ్రీహరి బొలేరో వాహనంలో తిరుగుతుండేవాడు. తొలుత నాయుడుపేటలోని ఆయిల్ దుకాణంలో వీరు చోరీ చేశారు. అనంతరం కావలి తుమ్మలపెంటరోడ్డులోని సీతాలం బాలక్రిష్ణ సెల్‌ఫోన్ దుకాణంలో ఈనెల 16న రాత్రి చోరీ చేసి 26 సెల్‌ఫోన్లు, నావల్టీలను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై పట్టణ సీఐ తమ సిబ్బందితో విచారణ చేపట్టారు. గురువారం ఉదయం కావలి ఉత్తర శివార్లలో ఉన్న లారీ ఆఫీసు సమీపంలో యనమల సూర్యతేజ, చిట్టేటి వినయ్ కుమార్, నాగేండ్ల శ్రీహరిలను అరెస్ట్ చేసి బొలేరో వాహనాన్ని, వారి దగ్గరున్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాగా జైలులో పరిచయం అయిన పాత నేరస్థులు నాగరాజు, మీర్దావలిలు పరారీలో ఉన్నారు. వారిని త్వరలో అరెస్టు చేసి మిగిలిన సొత్తును స్వాధీనం చేసుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు.

నీటి గుంటలో పడి బాలుడి మృతి



బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

కావలి రూరల్, మార్చి 21: శుభకార్యానికి వచ్చి బహిర్భూమికని వెళ్లి నీటి గుంటలో పడి పాలకీర్తి గోవర్ధన్(10) మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం పట్టణంలోని మద్దూరుపాడు టిడ్కో గృహాల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు, ఉలవపాడు మండలం మన్నేటికోటకు చెందిన రాజేష్ టిడ్కో గృహాల్లో బంధువుల గృహప్రవేశానికి కుటుంబ సభ్యు లతో కలిసి వచ్చాడు. ఆ గృహాలకు సమీపంలోని పొలాల వద్దకు బహిర్భూమికని రమేష్ కుమారుడు గోవర్ధన్‌తోపాటు మరో ఇద్దరు పిల్లలు వెళ్లారు. అక్కడున్న నీటి గుంటలో ప్రమా దవశాత్తు గోవర్ధన్ కాలుజారి పడిపోయాడు. మిగిలిన ఇద్దరు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా, వారు నీటిగుంట వద్దకు పరుగులు తీశారు. బాలుడి ఆచూకీ తెలియక పోవడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది నీటిగుంటలో గాలిం పు చేపట్టి బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే బాలుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని తీసుకుని స్వగ్రామానికి వెళ్లిపోయారు. ఈ విషయంపై రూరల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఆటోను ఢీకొన్న లారీ

యువకుడి మృతి...మరొకరికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైం): అతి వేగంతో వస్తున్న ఓ లారీ ముందు వెళుతున్న ట్రక్కు ఆటోను ఢీకొంది. ఆటో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన జశ్వంత్ కుమార్(23), శశికుమార్ ఆకుతోట లోని సెంట్రింగ్ మేస్త్రీ తేజ వద్ద పనిచేస్తున్నారు. ఇటీవల లేగుంటపాడు లో సెంట్రింగ్ పనులు చేశారు. అక్కడ పని పూర్తి కావడంతో గురువారం సెంట్రింగ్ షీట్లను ట్రక్కుఆటోలో వేసుకుని యజమాని ఇంటికి బయలుదేరారు. చింతా రెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు సమీపానికి వచ్చే సరికి కావలి వైపు నుంచి వస్తున్న లారీ వేగంగా ఆటోను వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో వెనుక వైపు ట్రక్కులో ఉన్న జశ్వంత్‌కుమార్, శశికుమార్ తలకు తీవ్ర గాయాల య్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం సమీ పంలోని మెడికవర్ వైద్యశాలకు తరలించారు. జశ్వంత్ కుమార్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారిం చారు. గాయాలపాలైన శశికుమార్ అపస్మారక స్థితిలో వైద్యశాలలో చికిత్స పొందుతు న్నాడు. నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ గీతారమ్య ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	108
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6374
వెండి కిలో ధర	రూ. 77,500
వెండి ఒక గ్రాము	రూ. 79.50

విద్యావేత్తకు తుది వీడ్కోలు

- రత్నంకు నివాళులర్పించిన ప్రముఖులు



రత్నం అంత్యక్రియల్లో నారాయణ, వేమిరెడ్డి తదితరులు

నెల్లూరు (విద్య), మార్చి 21 : విద్యావేత్త, రత్నం విద్యాసంస్థల అధినేత కొర్రపాటి వెంకట రత్నం (కేవీ రత్నం)కు రాజకీయ, విద్యా ప్రముఖులు, ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం కన్నుమూసిన విషయం విదితమే. గురువారం సాయంత్రం అంతిమయాత్ర నిర్వహించి పిడతా పోలూరులోని రత్నంగారి తోట(రత్నం విద్యాసంస్థల ప్రాంగణం)లో అంత్యక్రియలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ హాజరై రత్నంకు నివాళులర్పించారు. జిల్లాకు కార్పొరేట్ విద్యను పరిచయం చేసిన రత్నం మృతి బాధాకరమని, విద్యారంగానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పూర్వపు భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె దీప, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు నివాళులర్పించారు. రత్నం కుమారులు వేణుగోపాల్, కృష్ణకిషోర్‌ను పరామర్శించారు. టీడీపీ నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, జెన్ని రమణయ్య, గురువారెడ్డి, షేక్ అమ్మల్లా తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

- పోర్టు సీవోవో రాజన్‌బాబు



పోర్టులో మొక్కలు నాటుతున్న సీవోవో రాజన్‌బాబు

ముత్తుకూరు, మార్చి 19 : అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు అన్నారు. గురువారం అంతర్జా తీయ అడవుల దినోత్సవం సందర్భంగా అదాని కృష్ణపట్నం పోర్టులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ కృష్ణపట్నం పోర్టు గ్రీన్ పోర్టుగా రూపు దిద్దుకునేందుకు ప్రతి ఉద్యోగి, కార్మికుడు ఒక మొ క్కను తప్పనిసరిగా నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఈహెచ్ ఎస్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ఉద్యోగులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను తరిమికొట్టేందుకే కలయిక

- పొంగూరు నారాయణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), మార్చి 21: అరాచక పాలనను తరిమి కొట్టి ప్రజలకు సుపరిపాలన అందించాలన్న ఉద్దేశంతోనే టీడీపీ, జనసేన, బీజేపీల కలయిక జరిగిందని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం జనసేన, తెలుగుదేశం పార్టీల నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతోపాటు పలువురు టీడీపీ నాయకులకు జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పుణ్యమా అని పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జనసైనికులు ప్రతి ఒక్కరికి గౌరవం ఇస్తామని హామీ ఇచ్చారు. మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పని చేయాలన్న ఉద్దేశంతోనే ఈ పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. శుక్రవారం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఉమ్మడి అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కలెక్టర్, ఎస్పీలపై ఈసీకి ఫిర్యాదు

- విలువైన క్వార్ట్జ్‌ను తవ్వేస్తుంటే పట్టించుకోరేం ? : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి



క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలను చూస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మండలం మరుపూరు, మొగళ్లూరులలో రూ.వందల కోట్ల క్వార్ట్జ్‌ను ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని, ఈ వ్యవహారంపై ఆధారాలతోసహా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునే దమ్ము కలెక్టర్, ఎస్పీలకు లేకుండా పోయిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆ ఇద్దరు అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో సోమిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 'క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై ఆధారాలతో సహా డిసెంబరు నుంచి పోరాడుతున్నా ఇంత వరకు ఎవరిపై కేసు పెట్టారు.. ఏం చర్యలు తీసుకున్నారంటే కలెక్టర్ వద్ద సమాధానం లేదు. మేము కేంద్ర హోం మంత్రికి ఫిర్యాదు చేస్తే అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు రావడంతో వరదాపురంలో అక్రమ మైనింగ్ ఆగింది. తాజాగా మార్చి 18న ఉదయం మరోమారు మరుపూరులో అక్రమ తవ్వకాలను అడ్డుకొని ఆధారాలతో సహా కలెక్టర్‌కు పంపాం. కానీ ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఒక మైన్స్ డీడీను పరిశీలనకు పంపి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ భూముల్లో దోపిడీ జరుగుతుంటే రెవెన్యూ, పోలీసులు అక్కడకు వెళ్లరా!?. తూతూమంత్రంగా కలెక్టర్ ఒక లెటర్ రాసి తప్పించుకున్నారు. కాకాణికి, వైసీపీ ఎమ్మెల్యేలకు కాళ్లు ఒత్తుతాం.. మేము చర్యలు తీసుకోలేం అన్నట్లు అధికారుల తీరు ఉంది. జిల్లాలో ఒక్క క్వార్ట్జ్‌లో రూ.వేల కోట్ల దోపిడీ జరిగింది. వరదాపురంలో రూ.500 కోట్లు, మొగళ్లూరులో రూ.400 కోట్లు, మరుపూరులో రూ. 300 కోట్లు దోచుకున్నారు. ఒక్క ఇరుపూరు రీచ్‌లో రూ.300 కోట్ల ఇసుకను లేపేశారు. ఇలా ప్రజల ఆస్తి దోచుకుపోతుంటే కలెక్టర్, ఎస్పీ ఏం చేస్తున్నారు? వారికి వాటాలు లేకపోతే ఎందుకు పట్టించుకోవడం లేదు. రామదాసు కండ్రిగలో పేదల సీజేఎఫ్ఎస్ భూములను కాకాణి అల్లుడికి దారాధత్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమ మైనింగ్‌పై సిట్ వేసి విచారణ జరుపుతాం. ఏ ఒక్కరినీ వదిలిపెట్టం' అంటూ సోమిరెడ్డి హెచ్చరించారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- అధికారుల సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 21 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. వలంటీర్లుగానీ, ప్రభుత్వ ఉద్యోగులుగానీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, రాజకీయ పార్టీలతో ప్రచారంలో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు పాల్గొన్నారు. కాగా, నెల్లూరులోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వికాస్ మర్మత్, డీడీఐపీఆర్ సదారావు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై చెక్‌పోస్టు ఏర్పాటు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మనుబోలు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లా ఎస్పీ తిరు మలేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు హైవేపై గురువారం పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లా, నెల్లూరు జిల్లాల సరిహద్దు బద్దెవోలు క్రాస్‌రోడ్డు కావడంతో అక్కడ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. చెన్నై, కర్నాటక నుంచి ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తున్నా, రూ. 50 వేలకు మించి నగదు లెక్కల్లేకుండా తీసుకెళుతున్నా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు 24గంటలు చెక్‌పోస్టు వద్ద ఉండి ఇరువైపులా వెళ్ళే వాహనాలను తనిఖీలు చేస్తారని, ఎన్నికలు ముగిసే వరకు చెక్‌పోస్టు తనిఖీలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఎండల వేడి కాదు.. ఎన్నికల హీట్ !

● కానరాని చలివేంద్రాలు
● ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు

ఆత్మకూరు మార్చి 21: ప్రతిఏడాది మార్చి ప్రారంభంలోనే ఆత్మకూరు మున్సిపాల్టీలోని వివిధ ప్రాంతాలలో ఎటుచూసినా రాజకీయపార్టీలు, స్వచ్ఛందసేవా సంస్థలు, ప్రముఖులు చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారు. అడుగడునా చలివేంద్రం కేంద్రాలు ఉండి జనాల దాహార్తిని తీర్చేవి. ఈ ఏడాది ఎన్నికల హడావిడిలో నాయకులు, జనాలు, చివరికి అధికారులు సైతం చలివేంద్రాలను మరచిపోయినట్లు ఉన్నారు. ఆత్మకూరులో బీఎస్ఆర్ సెంటర్‌లో ఎన్ఆన్ఐ మీరీ మో హిద్దీన్, ఆర్డీవో ఆఫీసుకు వెళ్లే దారిలో బాబా వెల్డింగ్ షాపు వద్ద మాత్రమే చలివేంద్రలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరులో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు అధికంగా ఉన్నాయి. గతంతో పోలిస్తే వృక్షసంపద కూడా తరిగిపోయింది. ఫలితంగా మునుపెన్నడూ లేని విధంగా అధిక వేడి ఎగజిమ్ముతోంది. పైగా ఆత్మ కూరు పట్టణంలో విశాలమైన వీధులు ఉండవు. అన్నీ ఇరుకు సందులే. ఈ వేడి పట్టణం అంతా



ఆత్మకూరు బీఎస్ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం

విస్తరించడంతో ఈ వేసవిలో ప్రజలకు ప్రతి 5నిమిషాలకు గొంతు ఎండిపోతుంది. బాటసా రులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారందరికి చలివేంద్రాలు చల్లటి నీరునందించి దాహార్తిని తీర్చేవి. ఇప్పుడు ఎన్నికల పుణ్యమా అంటూ నేతలు, అధికారులు, యువకుల నుంచి పెద్దల వరకు అందరూ ఎన్నికల ప్రచారం, ఓట్ల అభ్యర్థనలోనే తలమునకలై ఉన్నారు. ఫలితంగా చలివేంద్రాలు పెట్టే వారు లేక దాహార్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. స్వచ్ఛందసేవా సంస్థలు, మున్సిపల్ అధికారులు స్పందించి ఆత్మకూరులోని అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొత్తపల్లిలో కొరవడిన పారిశుధ్యం

అనంతసాగరం: కొత్తపల్లిలో పారిశుధ్యం కొరవడి కాలనీలు అధ్వానంగా మారాయి. కొన్ని వీధుల్లో మురుగు కాలువలు లేక ఇళ్ల నుంచి వచ్చే నీరు రోడ్డుపై పారుతుండటంతో దుర్వాసన వస్తుంది. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దోమలు ఎక్కువై విషజ్వరాలు ప్రబలే ప్రమాదం నెలకొంది.

ఆనం పరామర్శ

చేజర్ల, మార్చి 21: ఎన్వీ కండ్రిక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముప్పే పోలిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి పరామర్శించారు. అనంతరం గాలిపాళెం టీడీపీ నాయకులు ఓరుగుంట రమేష్ తండ్రి సుబ్బానాయుడు ఉత్తరక్రియలకు హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సీతారామపురం: సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, బసినేనిపల్లిలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఈవోపీఆర్డీ భార్గవి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాట్లను పరిశీలించారు. దివ్యాంగులు కేంద్రంలోకి చేరుకునేందుకు ర్యాంపులు ఉన్నాయా లేవా ఆరా తీశారు. ప్రతి కేంద్రంలో సౌకర్యాలు ఉండాలన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన

ఉదయగిరి రూరల్, మార్చి 21: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు నియమించిన ఉద్యోగులు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ నుంచి ఈవీ తెలిపారు.

ఉదయగిరి: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నోడల్ అధికారి దేవరకొండ ఈశ్వరమ్మ దిలావర్‌భాయ్‌వీధి, అగ్రహారం, నాగులబావివీధి, దేవలాలగడ్డ, యూనియన్‌రోడ్డు, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లు ఎక్కడా ఉండరాదని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

అప్పారికి ఘన నివాళి



ఉదయగిరి రూరల్, మార్చి 21: స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఐక్య ఉపాధ్యాయ సంఘ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎడమ తిరుపతయ్య, నాయబ్, దస్తగిరి అహ్మద్, హనీఫ్, ఫణిరాజ్, భోగ్యం శ్రీనివాసులు, రంతు జానీ, సుబ్బారెడ్డి, రామకృష్ణ, వెంకటరెడ్డి, ఏడుకొండలు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సీతారామపురం,మార్చి 21: మండలకేంద్రంలోని హరిజనవాడలో గురువారం అనారోగ్యంతో మరణించిన తెలుగుదేశం కార్యకర్త పోలిచర్ల చిన్నయ్య మృతదేహానికి పార్టీ మండల నాయకులు చింతల శ్రీనివాసులు, సర్పంచ్ భాగ్యకుమారి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు అందజేశారు. అనంతరం అదే కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న మరియమ్మ కు వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు ఇచ్చారు. జామవా, చెన్నకేశవులు,అబ్రహం, ఇజ్రాయిల్, కిరణ్ పాల్గొనారు.

ఒక్కసారి అవకాశమివ్వండి : కాకర్ల

ఉదయగిరి రూరల్: ప్రజలారా ఆలోచిం చండి.. ఒక్కసారి అవకాశమి వ్వండి.. నియో జకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూ పుతానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెం చలబాబుయాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ మండల కన్వీనర్ సీహెచ్ బయ్యన్న అధ్యక్షతన మండల టీడీపీ నాయకు లు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి యువత, మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వలసల నివారణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుం దన్నారు. ఎవరెన్ని డ బ్బులిచ్చినా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బా రెడ్డి, రియాజ్, గడ్డం వెంకటేశ్వర్లు, బొజ్జా శ్రీనివాసులు, సందానీ, భోగినేని కాశిరావు, బొబ్బూరి వెంగళరావు, ఎల్‌సీ రమణారెడ్డి, కలివెల జ్యోతి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాకర్ల సురేష్

ఓటు నమోదుకు మరో అవకాశం

ఉదయగిరి, మార్చి 21: నియోజకవర్గంలో ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని యువకులు.. గతంలో ఓటు ఉండి వివిధ కారణాలతో కోల్పోయిన వారు.. తిరిగి ఓటుహక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చినట్లు గురువారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సంఘం వచ్చేనెల 15వ తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భూ పట్టాలు రద్దు చేయాలని వినతి

వరికుంటపాడు, మార్చి 21: నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన భూ పట్టాలను రద్దు చేయాలని విరువూరు గ్రామస్థులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని 5-1, 5-2, 6-1, 6-2, 7-1, 7-2, 7-3 సర్వే నంబర్లలోని 30ఎకరాల ప్రభుత్వ భూమిని ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమందికి అధికారులు పట్టాలు మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామంలో సెంటు భూమి లేని నిరుపేదలు ఉన్నా మామూళ్ల మత్తులో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ పట్టాలు రద్దు చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

కావలి టౌన్, మార్చి21: జాతీయ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కావలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఇందిరానగర్ మున్సిపల్ హై స్కూల్ వద్ద జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు కృష్ణయ్య, ఆసిమ్, సీవో ప్రమోద్, హెల్త్ విజిటర్ ప్రసన్న పాల్గొన్నారు.

కలిగిరి: టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి మాట్లాడుతూ వారానికి మించి దగ్గు ఉన్న ప్రతి ఒక్కరు వైద్యకేంద్రాన్ని సందర్శించి గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ తిరుపతిరావు, ఎస్‌టీఎల్ఎస్ శివ, ఎస్‌టీఎస్ షబ్బీర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నిన్న ఇక్కడ.. నేడు అక్కడ !

● కరేడు నేత రాజకీయ విన్యాసం

ఉలవపాడు: కరేడు పంచాయతీ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ తరపున గ్రామంలో చక్రం తిప్పిన నాయకుడు లింగారెడ్డి మధుసూదన్‌రెడ్డి(మధురెడ్డి) 2014 ఎన్నికల్లో వైసీపీలో చేరారు. పోతుల రామారావు గెలుపులో ప్రత్యేక భూమిక పోషించాడు. అనంతరం పోతుల టీడీపీలో చేరగా మధురెడ్డి వైసీపీలోనే ఉండిపోయాడు. 2019 లో ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయలకు, గ్రామానికి దూరంగా మధురెడ్డి నెల్లూరులోనే ఉండి పోయాడు. కా గా టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మధురెడ్డి మంచి పరిచయస్తుడు. పైగా నెల్లూరులో ఆయన కాపురం ఉంటున్నాడు. ఈనెల 16న కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇం టూరి నాగేశ్వరరావు కరేడులో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. ఆ సమయంలో మధురెడ్డిని ఇం టూరి కలిశారు. అదే మధురెడ్డిని పక్కరోజునే కొందరు మధ్యవర్తులు వైసీపీ నేత విజయసాయిరెడ్డి వ ద్దకు తీసుకెళ్లి మాట్లాడించారు. మంతనాల అనంతరం 18న ఉదయం వైసీపీ సమన్వయకర్త బుర్రా మ ధుసూదన్ కరేడుకు వచ్చి వైసీపీకి మద్దతుగా పనిచేయిస్తానని మధురెడ్డి చేత ప్రకటన చేయించారు. ఈ పరిణామాలను మహీధర్‌రెడ్డి వర్గీయులు నిశితంగా గమనిస్తున్నారు.

వీపీఆర్, కావ్యల గెలుపే లక్ష్యం

బిట్రగుంట(దగదర్తి) మార్చి 21: నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించడమే తమ లక్ష్యమని మాలేపాటి సుబ్బానాయుడు, రవీంద్రనాయుడు అన్నారు. దగదర్తి మండల కూడలిలో గురువారం రాత్రి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సమావేశం జరిగింది. ముందుగా మాలేపాటి సోదరులు, యువనాయకుడు భానుచందర్ నాయుడు ఆధ్వర్యంలో వీపీఆర్, కావ్యలతోపాటు పార్టీ నాయకులు బీదరవిచంద్ర, పమిడి రవి కుమార్ చౌదరి, పాలిశెట్టిలకు ఘన స్వాగతం పలికారు. స్థానిక యువత బాణసంచా కాలుస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు సుధాకర్‌నాయుడు, శ్రీహరినాయుడు, అల్లంహనుమంతరావు, కంచర్లక్రిష్ణ, వినకుమార్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.


బీద, వీపీఆర్, కావ్యలకు నేతల సన్మానం


వరికుంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ రంగులతో ఉన్న బెంచీలు

నామమాత్రపు పర్యవేక్షణ

మండలాధికారులు మహమ్మదాపురం, యర్రంరెడ్డిపల్లి, గొల్లపల్లి, ఇస్కపల్లి, కాంచెరువు గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను మరిచి పోయారేమో అనే ఆరోపణ లు విన్పిస్తున్నాయి. మండల కార్యాలయ ఆవరణ లోనే రాజకీయ నాయకులు పార్టీ రంగులతో ఏర్పాటు చేసిన బెంచీలు కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారులు, సెంటర్లల్లో రాజకీయ నాయకుల విగ్రహాల దిమ్మెలు, ప్రభుత్వ పథకాల హోర్డింగులు దారిపొడవునా దర్శనమిస్తున్నాయి. విగ్రహాలకు నామమాత్రంగానే ముసుగులు వేసి చేతులు దులు పుకున్నారు. హోర్డింగులు, రాజకీయ నాయకుల విగ్రహ, జెండా దిమ్మెలు, శిలాఫలకాల వైపు



ఇస్కపల్లిలోనూ తొలగించని వైనం

కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యారు. జిల్లా కేంద్రా నికి శివారు మండలం కావడంతో తనిఖీలు ఉండవనే ధీమానో లేక అలసత్వమో ఏమోగానీ కోడ్ అమలులోకి వచ్చి రోజులు గడుస్తున్నా పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి.

- వరికుంటపాడు

ధాన్యానికి 'మద్దతు' దక్కేనా ?

● ప్రారంభమైన వరికోతలు ● పుట్టికి రూ.4 వేలు తగ్గిన ధర

కొండాపురం, మార్చి21: చేతికందిన ధాన్యాన్ని అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఈఏడాది ఇంకా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. తీవ్ర వర్షాభావంతో చెరువులకు నీరు రాకపోవడంతో మండల పరిధిలోని పలు గ్రామాల్లో బోర్ల కింద సుమారు 1000 ఎకరాల వరకు వరి సాగుచేశారు. నవంబరు, డిసెంబరు నెలల్లో సాగుచేయగా కోతలు ప్రారంభమయ్యాయి. తీవ్ర వర్షాభావంతో మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా నేకునాంపేట, సాయిపేట, భీమవరప్పాడు, గుడవళ్లూరు తదితర గ్రామాలలో రైతులు వరి సాగుచేశారు. ఎకరం సాగుకు రూ.35 వేల వరకు అవుతుండగా, కౌలు భూమి అయితే మరో రూ.12 వేల వరకు అధికంగా ఖర్చవుతుంది. ఎకరానికి వరి దాదాపు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

● పుట్టికి రూ.4 వేలు తగ్గిన రేటు

మార్చి మొదటివారంలో ఆర్ఎన్ఆర్ (షుగర్ లెస్) పుట్టి ధర రూ.24 వేలకు పైన ఉండగా మార్చి మూడవవారంలో రూ.4,000పైగా తగ్గింది. పుట్టి రూ. 24 వేలు ఉన్నప్పుడు 75 కేజీల ధాన్యం బస్తా రూ.2100 పైగా కొనుగోలు చేసేవారు. ధర తగ్గిపోవడంతో 75 కేజీల రూ.350 వరకు తగ్గింది. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఉంటే తమకు గిట్టుబాటు ధర దక్కేదని రైతులు అంటున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.


వరికోత కోస్తున్న యంత్రం

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి : ఇంటూరి

లింగసముద్రం, మార్చి 21 : పరస్పర సహకారంతో గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు.గురువారం లింగసముద్రం పంచాయతీలోని జంగంరెడ్డిపాలెంలో జనసేన సీనియర్ నాయకులు కొట్టే నారాయణరావు అధ్యక్షతన జరిగిన టీడీపీ-జనసేన పార్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జనసేన జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాసులు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో ఇంటూరి మాట్లాడుతూ మీ ప్రతి సమస్యను నా సమస్యగా భావించి పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు కొట్టే నారాయణరావు, కె వెంకటాచార్యులు, కె సత్యనారాయణ, టీడీపీ నాయకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పోతులతో ఇంటూరి భేటీ

కందుకూరు : మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుతో కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గురువారం భేటీ అయ్యారు. ఒంగోలు సమీపంలోని చెరువుకొమ్ముపాలెం వద్దగల పోతుల గ్రానైట్ పరిశ్రమ కార్యాలయానికి వెళ్లి నాగేశ్వరరావు ఆయన్ను కలిసి చర్చించారు. ఈ నెల 24న కందుకూరులో నిర్వహిస్తున్న విస్తృతస్థాయి సమావేశానికి నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి హాజరవుతున్నందున, ఆ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

ఇంటూరికే మా మద్దతు : కందుకూరు 21వ వార్డు పరిధిలోని ఏరియా హాస్పటల్ వెనుక ప్రాంతంలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంటూరి నాగేశ్వరరావు విజయంకోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమం లో నాయకులు పాకల మల్లికార్జున, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, నాదెండ్ల మమత, శ్రీలక్ష్మి, ద్రాక్షాయణి పాల్గొన్నారు. కాగా బుధ వారం రాత్రి పట్టణంలోని పాత బ్యాంకు బజారులో నివసించే పలువురు ఆర్యవైశ్యులు ఇంటూరికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారందరికీ నాగేశ్వరరావు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఆత్మీయ సమావేశంలో అభివాదం చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

సచివాలయం మిద్దెపై వైసీపీ జెండా తొలగింపు

కావలి, మార్చి21: పట్టణంలోని పాతూరు ఉర్దూ స్కూల్‌వీధిలోని సచివాలయం-2 మిద్దెపైన ఉన్న వైసీపీ జెండాను గురువారం ఎన్నికల సిబ్బంది తొలగించారు. సచివాలయం మిద్దెపై వైసీపీ జెండా అని గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. స్పందించిన అధికారులు వెంటనే జెండాను తొలగించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే పట్టణంలోని అన్ని పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు, పోస్టర్లను తొలగించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జీ. శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

577 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి : స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 603పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 12కంపెనీ ప్రతినిధులు పాల్గొని 577 బేళ్లను కొనుగోలు చేశారు.నోబిడ్-5 సీఆర్-14, జంపింగ్ లాట్స్-7 కారణాలతో 26 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.231, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.229.11గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

చేవూరు ఎంపీటీసీ శ్రీనివాసులు మృతి


నివాళులు అర్పిస్తున్న బీఎమ్మార్, మహీధర్‌రెడ్డి తదితరులు

గుడ్లూరు : మండలంలోని చేవూరు ఎంపీటీసీ సభ్యులు నక్కల శ్రీనివాసులు అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ తదితరులు గురువారం చేవూరుకు శ్రీనివాసులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు.

అదనపు నీటి కేటాయింపులు రాజగోపాల్ ఘనతే !

జలదంకి : ఐఏబీలో కావలి కాలువకు ఎస్వీపాలెం మేజరు ఆయకట్టు వరకే ఈ ఏడాది సాగునీటి కేటాయింపులు చేయగా, ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సీఎం జగన్‌తో చర్చించి జలదంకి మండలానికి 1.5 టీఎంసీల సోమశిల జలాలు అదనంగా కేటాయించేలా కృషి చేశారని మండల వైసీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీనేత పాలవల్లి మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. స్వంత నిధులు ఖర్చుచేసి కాలువల్లో పూడిక తీయించి రైతులకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో జరిగే విజయసాయిరెడ్డి, రాజగోపాలరెడ్డిల పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు కేతిరెడ్డి రవిరెడ్డి, తిప్పారెడ్డి ఇందిరమ్మ, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మేదరమెట్ల శివలీల, గోపన్నపాలెం సర్పంచి గండు వెంకారెడ్డి, వీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

విజయసాయికి సన్మానం

కావలిటౌన్ : వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దామిశెట్టి సుధీర్‌నాయుడు గురువారం నెల్లూరులో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను కలిసి సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుధీర్‌నాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారని, పార్టీ పటిష్టతకు అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఆయన తండ్రి, మాజీ కౌన్సిలర్ దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి వలసలు

లింగసముద్రం, మార్చి 21 : మండలంలోని పెదపవనిలో వైసీపీకి చెందిన ఇరువురు నేతలు జనసేన పార్టీలో చేరారు.బుధవారం రాత్రి తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో పెదపవని గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మలిశెట్టి మనోహర్, గుత్తి చిన మాల్యాద్రి మరికొందరు జనసేనలో చేరారు. కార్యక్రమంలో జనసేన నేతలు కొనిదెల శ్రీనివాసులు, దేవళ్ల భాస్కరరావు, అంగులూరి నరసింహారావు, ఇనకొల్లు శ్రీనివాసులు, బింకం నాగేంద్ర, అడపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరిన మలిశెట్టి మనోహర్ తదితరులు

టీడీపీలో మత్స్యకారుల చేరిక

ఉలవపాడు, మార్చి 21 : కరేడు పంచాయతీ పరిధిలోని బట్టిసోమయ్యపాలెంకు చెందిన పలువురు మత్స్యకారులతోపాటు 10వ వార్డు మెంబరు కాటం శ్రీను గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. గ్రామకాపులు వాయిల మ స్తాన్, కాటం రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ నుంచి బాబురావు, పో లయ్య, పార్వతయ్య కళ్యాణ్, ఆంజనేయులు, బ్రహ్మంగారి శివ, చిన్నంగారి పార్థన్‌రావు, ప్రయశయకావేరి గోపాల్, పార్వతయ్య చిన్నపోలయ్య, కుమారి రాము వాయిల గణేష్, శ్రీను, రమేష్ తదితరులు టీడీపీలో చేరారు.

పసుపులేటితోనే కావలి అభివృద్ధి : సుగుణమ్మ

కావలిటౌన్, మార్చి21: పసుపులేటితోనే కావలి అభివృద్ధి సాధ్యమని పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ పేర్కొన్నారు. గురువారం 37వ వార్డులో ఆమె పర్యటించి ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. తన భర్తను గెలిపించుకుంటే అవినీతికి నీడలేకుండా చేస్తారని పేర్కొన్నారు.

ఉత్తుత్తి బటన్ నొక్కుడుతో మోసం : మల్లి

కావలి, మార్చి21: సంక్షేమ పథకాల అమలులో భాగంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఉత్తుత్తి బటన్ నొక్కుడుతో ప్రజలను మోసం చేయటం తగునా ? అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి పేర్కొన్నారు. స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బలహీన వర్గాల మహిళలకు చేయూత పథకం బటన్ నొక్కినా ఇంతవరకు ఏ ఒక్కరికి డబ్బులు పడలేదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే విద్యాదీవెన.వసతిదీవెన నగదు కూడా జమ కాలేదన్నారు. "ఉత్తుత్తి బటన్‌లు కరెంట్ లేనప్పుడు నొక్కి లబ్ధిదారులను మోసం చేయటం తగదన్నారు. సమావేశంలో దళిత నేతలు జడ్డా వాసు, చలంచర్ల లక్ష్మయ్య, జరుగుమల్లి విజయరత్నం, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరా విజయలక్ష్మికి సత్కారం

కావలిటౌన్, మార్చి21: ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన అమరా విజయలక్ష్మిని గురువారం వాసవీ వనిత లెజెండ్స్ నిర్వాహకులు సత్కరించారు. ఏఎంఎస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో లెజెండ్స్ అధ్యక్షురాలు ఇన్నమూరి హేమలత, జోనల్ చైర్మన్ అనుమాలశెట్టి కామాక్షి ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి, లెజెండ్స్ మట్టా రజని, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషక కేంద్రాలుగా అంగన్‌వాడీలు

కందుకూరు : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన అంగన్‌వాడీ కేంద్రాలు సంపూర్ణ పోషక కేంద్రాలుగా పనిచేస్తున్నాయని సీడీపీవో శర్మిష్ఠ పేర్కొన్నారు. మండలంలోని మాచవరం-3 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభావతి, మహిళాపోలీసు, గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరులో కేంద్ర బలగాల కవాతు

అల్లూరు,మార్చి21 : స్థానిక ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు గురువారం సాయంత్రం అల్లూరులోని ప్రధాన రహదారిలో కవాతు నిర్వహించాయి. అల్లూరుపేట నుంచి ప్రారంభమైన కవాతు ప్రధాన రహదారిలోని పలు కూడళ్ల మీదుగా సాగింది.



ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

● సర్వేపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

వెంకటాచలం, మార్చి 21: ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలుచేసి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే లక్ష్యం అని సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు తెలిపారు. వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 55 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 2,30,615 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. వీరిలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 45 శాతం అంగవైకల్యం కలిగి ఉన్న వారికి ఎలెక్షన్ కమిషన్ ప్రత్యేకంగా హోమ్ ఓటింగ్ అవకాశాన్ని కల్పించిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. సీవిజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. ఎలెక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి హరి నారాయణన్ ఆదేశానుసరం సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడటమే లక్ష్యమన్నారు.

కసుమూరు శివాలయంలో దీపావెంకట్


శివాలయంలో దీపావెంకట్

వెంకటాచలం, మార్చి 21: కసుమూరులోని శివాలయంలో గురువారం పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అల్లూరు ప్రసాద్ నాయుడు, సుబ్బానాయుడు, నాగరాజరెడ్డి, ముళ్లంగి ప్రభాకర్ నాయుడు, వీరేపల్లి వెంకటేశ్వర్లు నాయుడు, ఆరుముళ్ల మురళీ తదితరులున్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 21: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి పాతపాటి వెంకటరత్నం సూచించారు. గురువారం తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ, నగర కమిషనర్ రమణబాబు, సెక్టార్ అధికారి దిలీప్‌కుమార్, సహాయ గణాంక అధికారి రామ్మోహన్, వీఆర్వోలు, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వెంకటాచలం, మార్చి 21: మండలంలోని తిక్కవరప్పాడు, అనికేపల్లి, కంటేపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ పూర్ణచంద్రరావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల గురించి వీఆర్‌వోలు, బీఎల్‌వోలతో ఆయన చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మొక్కల సంరక్షణపై అవగాహన

● వీఎస్‌యూ యూనిట్ ప్రత్యేక శిబిరం

వెంకటాచలం, మార్చి 21 : కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో గురువారం స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లోని వీధులు, కాలువలు శుభ్రం చేయడం జరిగింది. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కే విద్యాప్రభాకర్, డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ అనిల్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు తదితరులున్నారు.

కామాక్షితాయి ఆలయ హుండీల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 21: మండలంలోని జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో హుండీల లెక్కింపు గురువారం జిల్లా దేవాదాయ శాఖ ఏసీ జే శ్రీనివాసరావు అధ్వర్యంలో జరిగింది. 70 రోజుల పాటు భక్తులు హుండీలలో సమర్పించిన కానుకల ద్వారా రూ. 30,10,694 మేర ఆదాయం చేకూరిందని ఆలయ ఈఓ వి గిరికృష్ణ తెలిపారు. 147.500 గ్రాముల బంగారు వస్తువులు, 253.100 గ్రాముల వెండి వస్తువులను భక్తులు హుండీల ద్వారా సమర్పించారు.

టీడీపీలోకి వైసీపీ నేత 'గుత్తా'


టీడీపీలో చేరిన శ్రీనివాసరావు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 21 : స్థానిక వైసీపీ నేత గుత్తా శ్రీనివాసరావు (జీఎస్ఆర్) గురువారం టీడీపీలో చేరారు. రేబాలలోని రియల్ వ్యాపారి భువనేశ్వరం మురళి నివాసంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గుత్తా శ్రీనివాసరావుకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే రేబాల గ్రామంలో బుచ్చి బ్యాంకు మాజీ అధ్యక్షుడు ఏటూరి శివరామకృష్ణారెడ్డి నివాసానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వెళ్లి ఎంపీ అభ్యర్థిగా తనకు, కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మద్దతునిచ్చి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ మేరకు ఏటూరి తమ సంఘీభావం తెలిపారు,

ప్రశాంతిరెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి : పల్లంరెడ్డి


ప్రశాంతిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సురేష్‌రెడ్డి

కొడవలూరు: నియోజకవర్గ అభివృద్ధి కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేసి గెలుపుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట పల్లంరెడ్డి సాయిమోహన్‌రెడ్డి, పల్లంరెడ్డి సుజిత్ కుమార్‌రెడ్డి తదితర టీడీపీ నాయకులు ఉన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం : కుడుముల


ప్రశాంతిరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

విడవలూరు: ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యమని దండిగుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుడుముల మల్లికార్జున అన్నారు. నెల్లూరులోని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నివాసంలో ప్రశాంతిరెడ్డిని గురువారం గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దులూరి సునీల్, నూకలపాటి రాఘవరెడ్డి, రాజ, సుబ్రహ్మణ్యం, సోమయ్య, వెంకటస్వామి, రమణయ్య పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతికి మహిళల మద్దతు


ప్రశాంతిరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న ఇనమడుగు నాయకులు

నెల్లూరు (హరనాథపురం): కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మహిళలు మద్దతు తెలిపారు. ఆ నియోజకవర్గంలోని ఇనమడుగు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, మహిళలు గురువారం నెల్లూరులోని ప్రశాంతిరెడ్డి నివాసానికి చేరుకుని మాట్లాడారు. ఇనమడుగు పంచాయతీ సభ్యురాలు కామాక్షమ్మ, చైతన్య తదితరులు ప్రశాంతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, నరేష్, భక్తవత్సలం పాల్గొన్నారు.

● **దినేష్‌రెడ్డి భేటీ**


ప్రశాంతిరెడ్డిని కలిసిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. పలువురు ముఖ్య నాయకులను పరిచయం చేశారు.

● **కొత్తూరు హరిజనవాడ వాసుల మద్దతు**

కొత్తూరు హరిజనవాడ, సిరిపాపల వాసులు ప్రశాంతిరెడ్డి నివాసానికి చేరుకొని మద్దతు తెలిపారు. టీడీపీ నాయకుడు దండి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖాదర్‌బాషా, సుధాకర్, గుల్జర్, షబ్బీర్, సాయి తదితరులు ప్రశాంతిరెడ్డిని కలిశారు.

25న అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

పొదలకూరు, మార్చి 21: పట్టణంలోని శివాలయ ప్రాంగణంలో వున్న శ్రీఅయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప దేవస్థానం అధ్యక్షుడు మొలబంటి శేఖర్‌బాబు, సెక్రటరీ చొప్ప వెంకటేశ్వర్లు తెలిపారు.

పార్టీ ప్రచారాల్లో పాల్గొంటే కఠిన చర్యలు

● డీలర్లకు తహసీల్దార్ హెచ్చరిక


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

మనుబోలు, మార్చి 21: పార్టీ ప్రచారాల్లో డీలర్లు, ఎండియు ఆపరేటర్లు పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్లు, ఎండియు ఆపరేటర్ల కు విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులతోగాని, ప్రజా ప్రతినిధులతో గాని ప్రత్యక్షంగా, పరోక్షంగానైనా ఎలాంటి ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొనరాదన్నారు. ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించా లని, విధులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీటిలు శివప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ డంపింగ్

● ఎన్నికల అధికారులకు టీడీపీ నేతల ఫిర్యాదు


వీలుకానిపల్లెలో గ్రావెల్‌ను డంపింగ్ చేసిన వైసీపీ నాయకులు

తోటపల్లిగూడూరు, మార్చి 21 : మండలంలోని కొత్తపాలెం, వీలుకానిపల్లి గ్రామాలలో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ డంపింగ్ చేస్తున్నారని కొత్తపాలెం మాజీ సర్పంచ్ చేవూరు శ్రీనివాసులు, వీలుకానిపల్లి సీనియర్ టీడీపీ నాయకుడు గోపిరెడ్డి వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఓ వైసీపీ కీలక నేత గ్రావెల్ డంపింగ్ చేస్తున్నారని టీడీపీ నాయ కులు ఆరోపిస్తున్నారు. అంతేగాక రైతులను ఉసిగొలిపి గ్రావెల్ మేమే డొంకలకు తోలుకుంటున్నామని చెప్పమనడం హాస్యాస్పదంగా ఉందన్నా రు. ఈ ఐదు సంవత్సరాలు పొలాలకు వెళ్తున్న డొంకలు కనబడలేదా.. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత రైతులు గుర్తుకొచ్చారా టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు తాయిలాలు తప్ప మరొకటి కాదని ఆరోపిస్తున్నారు.

కేవీ రత్నంకు కురుగొండ్ల నివాళి

రాపూరు(డక్కిలి), మార్చి 21: రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం మృతి తనని దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్, పెంచలకొన దేవస్థానం మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ అన్నారు. గురువారం కేవీ రత్నం భౌతికకాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంతో మంది విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దిన మంచి వ్యక్తి కేవీ రత్నం అని కొనియాడారు.

ఎటుచూసినా... అంధకారమే!


అంధకారం ఆవహించిన ఉడ్‌కాంప్లెక్స్

- అధ్వానంగా ఉడ్‌కాంప్లెక్స్ ప్రాంతం
- వీధి దీపాలు, శానిటేషన్ ఏర్పాటుకు పూర్తయిన టెండర్లు
- పనులు అప్పగించడంలో ఇంజనీరింగ్ విభాగం జాప్యం
- పారిశ్రామికవేత్తలకు తీవ్ర అసౌకర్యం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 21 : నగరంలోని అయ్యప్పగుడి సమీపంలో గల ఉడ్ కాంప్లెక్స్ ప్రాంతంలోని పారిశ్రామికవేత్తలు, ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పారిశ్రామిక ప్రాంతం ఏపీఐఐసీ పరిధిలోనిది. ఇక్కడ సంవత్సరాలుగా వీధిదీపాలు, శానిటేషన్, రోడ్లు లేక స్థానిక పరిశ్రమల నిర్వాహకులు కష్టాలు పడుతున్నారు. అయితే ఇటీవల నిధులు సమకూరడంతో ఐలా కమిషనర్ ఉడ్ కాంప్లెక్స్‌లో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచారు. తక్కువ టెండర్ దాఖలు చేసిన వారికి పనులు అప్పగించారు.

ఏడాది కాలానికి పనుల అప్పగింత

ఉడ్ కాంప్లెక్స్‌లో వీధిదీపాలు, శానిటేషన్ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించిన తరువాత వారితో పనులను చేయించాల్సిన బాధ్యత ఏపీఐఐసీ ఇంజనీరింగ్ విభాగానికి ఉంటుంది. ఏడాది కాలానికి విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.9లక్షలు, శానిటేషన్ నిర్వహణకు రూ.4.50 లక్షలకు పనుల అప్పగించారు. అయితే ఇంజనీరింగ్ విభాగ అధికారుల నిర్లక్ష్యంతో ఉడ్ కాంప్లెక్స్‌లో పనులు ప్రారంభం కాలేదు. నిధులు ఉండి టెండర్లు పూర్తైనా పనులను ప్రారంభించని కాంట్రాక్టర్లపై, అదే విధంగా సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వారంలోగా పనులు ప్రారంభిస్తాం

ఉడ్ కాంప్లెక్స్ ప్రాంతంలో వీధిదీపాల ఏర్పాటుకు, శానిటేషన్ నిర్వహణకు టెండర్లు పూర్తయ్యాయి. ఇప్పటికే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించాను. ఇంకా ఎందుకు ప్రారంభించలేదో వివరణ అడిగి తెలుసుకొని వారం రోజుల్లో పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపడతాము.

- విజయరత్నం, (ఏపీఐఐసీ జెడ్ఎం)

రాజరాజేశ్వరి హుండీల ఆదాయం రూ.39.39 లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 21 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం హుండీల లెక్కింపు జరిగింది. గతేడాది అక్టోబరు 25 నుంచి గురువారం వరకు భక్తు లు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.36,84,254, అన్నదానం హుండీ ద్వారా రూ.2,55,607 కలిపి మొత్తం రూ.39,39,861 వచ్చింది. అమెరికన్ డాలర్ 1, కెనడా డాలర్స్ 20, సింగపూర్ డాలర్స్ 10 కూడా వచ్చాయి. హుండీల లెక్కింపునకు పర్యవేక్షకులుగా దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు, సూళ్లూరు పేట చెంగాళ్లమ్మ ఆలయం సహాయ కమిషనర్ డీ వెంకటేశ్వర్లు వ్యవహరించారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి ఆలయ సహాయ కమిషనర్ ఈవో జే వెంకట సుబ్బయ్య, ఛైర్మన్ రత్నం జయరామ్, ప్రధాన అర్చకుడు రఘురామ మూర్తి, బ్యాంకు అధికారులు, పోలీసు సిబ్బంది, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరాలయంలో.... రూ.1,01,700

నగరంలోని వాహబ్‌పేట ఉమామహేశ్వరాలయంలోనూ గురువారం హుండీల లెక్కింపు జరిగింది. గతేడాది డిసెంబరు 18 నుంచి బుధవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.1,01,700 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో బీ మల్లికార్జున రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు ఎస్‌సీ బాలాజీసింగ్, సుభాష్ సింగ్, అర్చకులు, భక్తులు పర్యవేక్షించారు.

టీడీపీతోనే సర్వతోముఖాభివృద్ధి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నారాయణ

నెల్లూరు (వైద్యం), మార్చి 21 : రాష్ట్రంలో సర్వతో ముఖాభివృద్ధి జరగాలంటే అది టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ వెల్లడించారు. గురువారం రాత్రి 9వ డివిజన్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజాపాలన అంటే భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్లాలన్నారు. వైసీపీకి పాలన చేతకాక భావితరాల భవిష్యత్తును సర్వనాశనం చేసిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో నిర్మించిన ఒక్క భవనంలోనే లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబుదన్నారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతలు తాళ్లపాక అనూరాధ, విజేత రెడ్డి, కువ్వారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

15వ డివిజన్‌లో ప్రచారం

పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి నగరంలోని 15వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి నారాయణను గెలిపించాలని కోరారు. మా సపోర్టు మీకేనమ్మ ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ స్థానికులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అంచూరు జానకి, చౌదరి, నీలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

దుర్మార్గపు వైసీపీని ఇంటికి పంపండి


టీడీపీ చేరిన వారితో అభ్యర్థి కోటంరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 21 : ఒక చేత్తో పది రూపాయలు ఇచ్చి మరో చేత్తో వంద రూపాయలు లాక్కు నే దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ఆయన కార్యాల యంలో 12, 17 డివిజన్ల యువతతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాగా, 17వ డివిజన్ గుండ్ల పాళెంకు చెందిన వైసీపీ నేత దుగ్గన సుధాకర్‌యాదవ్, 24వ డివిజన్ కల్లూరుపల్లికి చెందిన వడ్లపూడి సుమన్, వారి మిత్రబృందం ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. కుమ్మరి సంఘం నాయకులు కోటంరెడ్డికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సాబీర్‌ఖాన్, ఊటుకూరు దత్తాత్రేయ, కనపర్తి గంగాధర్, ఏపీ కుమ్మరి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పెళ్లూరు సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి ప్రచారం ప్రారంభం

పొదలకూరు, మార్చి 21: సూరాయ పాలెం, ఎర్రబల్లి, విరువూరు గ్రామాల్లో గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా సూరాయపాలెం విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, దశకంఠశేఖర పాల్గొన్నారు.

మీ దుకాణాల వద్ద శుభ్రత ఏది!?

● వ్యాపారులను ప్రశ్నించిన ఎంహెచ్‌వో


దుకాణదారుడితో మాట్లాడుతున్న ఎంహెచ్‌వో వెంకట రమణయ్య

నెల్లూరు(సిటీ), మార్చి 21 : మీ దుకాణాల వద్ద శుభ్రత ఎక్కడ..? మీ ఇళ్లైతే ఇలాగే ఉంచుకుంటారా..? అంటూ ఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణయ్య పలువురు వ్యాపారులను ప్రశ్నించారు. గురువారం నగరంలోని సంతాపేట, ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట ప్రాంతాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. షాపుల వద్ద అపరిశుభ్రత ఉంటే అందుకు సదరు దుకాణదారుడు బాధ్యత వహించాలని సూచించారు. ఇదేతీరు కొనసాగితే జరిమానా విధించాల్సిన వస్తుందని హెచ్చరించారు. దుకాణాల్లోని వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని కోరారు. అనంతరం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రోడ్లపై ఉన్న పశువులను వాహనాల్లో కల్లూరుపల్లి గోశాలకు తరలించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, ఫ్యాన్లు, తాగునీరుండాలి : కలెక్టర్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

నెల్లూరు(సిటీ),మార్చి 21 : నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద షామియానాలు, ఫ్యాన్లు, తాగునీరు ఖచ్చితంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో గల పోలింగ్ కేంద్రాలను కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. వేసవి తీవ్రత నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు అందుబాటులో ఉండాలని, వృద్ధుల కోసం వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పది నియోజకవర్గాల్లో విజయానికి కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పది నియోజకవర్గాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి పవన్ కల్యాణ్ అభిమానులు పూర్తి స్థాయిలో కృషి చేస్తారని ఆంధ్రప్రదేశ్ పవన్ కల్యాణ్ అభిమాన సంఘం అధ్యక్షుడు పోతురాజు టోనీబాబు తెలిపారు. గురువారం నగరంలోని టౌన్‌హాల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పీఎస్‌పీకే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టి నగరంలోని 4000, నెల్లూరు రూరల్ పరిధిలోని 3వేల మంది అభిమానులను, వారి కుటుంబ సభ్యులను కలసి కూటమికి మద్దతు పలికే విధంగా అవగాహన కల్పిస్తామని చెప్పారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పవన్‌కల్యాణ్ అభిమానులతో పరిచయ వేదిక నిర్వహించబోతున్నామన్నారు. కార్యక్రమంలో షేక్ షానవాజ్, సుధాకర్, శ్రీనివాసులు, రాము తదితరులు పాల్గొన్నారు.

సమాచారం అడిగితే ఇవ్వలేదు

నెల్లూరు(హరనాథపురం), మార్చి 21 : సాంఘిక సంక్షేమశాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమాచారాన్ని ఆర్టీఐ కింద అడిగితే ఆ శాఖ డీడీ ఇవ్వలేదని డీవీఎంసీ మాజీ సభ్యుడు, గిరిజన నాయకుడు కేసీ పెంచలయ్య ఆరోపించారు. గురువారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్టీఐ కింద సమాచా రం ఇవ్వకపోగా పెట్టుకున్న దరఖాస్తును చించేశారని చెప్పారు. సదరు డీడీపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో డీవీఎంసీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు, మానికల మురళి, మాకాని రవీంద్రబాబు, చెంబేటి ఉష పాల్గొన్నారు.

విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన

నెల్లూరు (వైద్యం), మార్చి 21 : నగరంలోని ఆర్ఎస్ఆర్ఎం హైస్కూల్‌లో విద్యార్థులకు క్షయవ్యాధిపై వైద్యాధికారులు గురువారం అవగాహన కల్పించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ అవగాహనతో వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. ఒకవేళ ఎవరికైనా వ్యాధి బారినపడితే ప్రభుత్వ ఆసుపత్రులలో పరీక్షలతో పాటు మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. డాక్టర్ మిజ్‌బాసుల్తానా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ వేణుగోపాల్, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భారతీయ మానవ హక్కుల మండలి జిల్లా అధ్యక్షురాలిగా సుమలత


గజరావు సుమలత

నెల్లూరు(హరనాథపురం), మార్చి 21 : నగరంలోని బీవీ నగర్‌కు చెందిన గజరావు సుమలతను భారతీయ మానవ హక్కుల మండలి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షురాలిగా ఆ మండలి నియమించింది. మంగళవారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ముంబై కేంద్ర కార్యాలయం నుంచి సుమలత నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న దుశ్చర్యలపై పోరాటం చేస్తానని, మహిళల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి

నెల్లూరు(క్రైం), మార్చి 21: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ప్రజలకు సూచించారు. గురువారం కేవీఆర్ పెట్రోల్‌బంకు, ఫత్తేఖాన్‌పేట, మాగుంట లేఅవుట్, కొండాయపాళెం గేటు, పొదలకూరురోడ్డు, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అక్రమ మద్యం నిల్వలు, పంపిణీ తదితరాలను గుర్తిస్తే డయల్ 112కుగానీ, పోలీసు స్టేషన్‌లోగానీ సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

తెప్పపై రుక్మిణీకృష్ణుల విహారం





తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిర్వహిస్తున్న శ్రీవారి తెప్పోత్సవాల్లో రెండవరోజైన గురువారం రుక్మిణీకృష్ణులు తెప్పపై భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుల ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో విద్యుద్దీపాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన తెప్పపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, అన్నమయ్య కీర్తనల ఆలాపనల నడుమ ఉత్సవమూర్తులను తెప్పపై పుష్కరిణిలో మూడుచుట్లు తిప్పారు.శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తెప్పపై దర్శనమివ్వనున్నారు.

మంచి రోజులొస్తాయి

● ధైర్యంగా పనిచేయండన్న లోకేశ్

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తనను కలిసిన పార్టీ నాయకులతో ఆప్యాయంగా మాట్లాడారు. తిరుమలలోని గాయత్రి సదన్ అతిథిగృహం వద్దకు బుధవారం రాత్రి చేరుకున్న ఆయన అక్కడున్న కార్యకర్తలతో మాట్లాడారు. దాదాపు 15 నిమిషాలు బయటే నిలబడి కార్యకర్తలతో ఫొటోలు దిగారు.గురువారం కూడా శ్రీవారి దర్శనానంతరం తనను చూసేందుకు వచ్చిన నాయకులతో, కార్యకర్తలతో కొంతసేపు మాట్లాడారు. 'ఎలా ఉన్నారు, మంచి రోజులు వస్తాయి, ధైర్యంగా పనిచేయండి' అని సూచించారు.చూడ్డానికి వచ్చిన ఎన్టీ రామారావు వీరాభిమాని, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఎన్టీఆర్ రాజును (రామచంద్రరాజు)ను ఆరోగ్యం ఎలా వుందంటూ పరామర్శించారు.ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, అనురాధ, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులు అమరనాథ రెడ్డి, జగన్మోహన్, మురళీమోహన్, ఆదిమూలం, పార్టీ నాయకులు నరసింహయాదవ్,పులిగోరు మురళి, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, జేబీ శ్రీనివాస్,రవినాయుడు, శ్రీధర్‌వర్మ, రాజు యాదవ్, కేశవులు, శివషణ్ముగం, దేవ, బాలాజి, విశ్వ, అంజి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయం ముందు కుటుంబంతో లోకేశ్

తిరుపతిపై తొలగని సస్పెన్స్

మీరు గెలుపు కోసం పనిచేయండి! అభ్యర్థి సంగతి అధ్యక్షుడు చూసుకుంటారు!!

తిరుపతి జనసేన నేతలతో నాగబాబు



నాగబాబును సన్మానిస్తున్న జనసేన నేతలు

తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన సీటు గెలుపు కోసం మీరు పనిచేయండి... అభ్యర్థి సంగతి అధ్యక్షుడు పవన్ చూసుకుంటారు... అంటూ తిరుపతి జనసేన నాయకులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు దిశానిర్దేశం చేశారు. గురువారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన తిరుపతి నాయకులతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సందర్భంగా పలువురు నాయకులు తిరుపతిలో నెలకొన్న పరిస్థితులను నాగబాబు దృష్టికి తీసుకెళ్లారు. నగర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి అయినా కార్యకర్తలకు అండగా నిలిచే నేతకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు పలువురు నాయకులు బయటి వారికి టికెట్ ఇస్తే తిరుపతి ప్రజలు ఆమోదించే పరిస్థితి లేదన్నారు. పార్టీ అభ్యర్థి తమను ఇంతవరకూ కలవలేదని, కార్యక్రమాల గురించి సమాచారం కూడా ఇవ్వడం లేదని మహిళా నేతల్లో సుభాషిణి ఫిర్యాదు చేయగా కీర్తన మాత్రం పార్టీ అభ్యర్థి మంచివారని, తిరుపతిలో లోకల్, నాన్ లోకల్ అన్న వాదన అర్థరహితమన్నారు. అత్యధికులు అభ్యర్థిగా స్థానికులకు అవకాశం ఇవ్వాలని కోరగా కొందరు పార్టీ ఎవరికి ఇచ్చినా పనిచేస్తామన్నారు. టీడీపీ నేతల నుంచీ సహకారం అందడం లేదని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ ఫిర్యాదు చేశారు. స్థానికుల్లో పోటీ చేయడానికి ఎవరు ఆసక్తిగా వున్నారని నాగబాబు ప్రశ్నించడంతో హరిప్రసాద్, కిరణ్ రాయల్ తాము పోటీ చేసేందుకు ఆసక్తిగా వున్నట్టు చెప్పారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమకున్న వనరులను కూడా వివరించారు. ఈ ఇద్దరూ కాకుండా ఇతరులెవరైనా వున్నారా అని నాగబాబు ప్రశ్నించగా కొందరు నాయకులు సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్ పేరును ప్రస్తావించారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ ప్రస్తుత అభ్యర్థి తిరుపతిలో గెలిచే అవకాశం లేదని, అతన్నే కొనసాగిస్తే ఓడిపోవడంతో పాటు పార్టీ ప్రతిష్ఠ కూడా దెబ్బతింటుందని స్పష్టం చేశారు. మెజారిటీ నాయకులు అభ్యర్థిని మార్చాలని, స్థానికులైన ఆశావహులతో రీ సర్వే జరిపించాలని కోరగా నాగబాబు పరిశీలిస్తామన్నారు. టీడీపీ నేతల నుంచీ సహకారం అందని విషయంపై టీడీపీ అధిష్ఠానంతో పవన్ కళ్యాణ్ మాట్లాడతారని నాగబాబు హామీ ఇచ్చారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి ఖచ్చితంగా గెలవాలని, దానికి ఏం చేయాలో చెప్పండని సలహాలు, సూచనలూ కోరారు. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో ఎపిక్ కార్డుల కుంభకోణానికి సంబంధించి వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి పాత్ర ఏమైనా వుందా అన్న విషయమై లోతుగా ఆరా తీయాలని ఆదేశించారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి గెలవాలని, అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాలను గౌరవించాలని ఆయన కోరారు. పార్టీ కోసం పనిచేసే వారిని పేరుపేరునా గుర్తుంచుకంటామని, వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతిలో అభ్యర్థి విషయంలో తలెత్తిన వివాదంపై పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుతో చర్చిస్తున్నారని వివరించారు. లోకల్, నాన్ లోకల్ సమస్య లేవనెత్తి వైసీపీ ట్రాప్‌లో పడొద్దంటూ ఆయన హెచ్చరించారు. తిరుపతి నేతలతో త్వరలో అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమావేశమవుతారన్నారు. రాజకీయాల్లో ఎపుడు, ఎవరికి ఏమి జరుగుతుందన్నది చెప్పలేమని, కొన్నిసార్లు త్యాగాలు చేయాల్సి వస్తుందన్నారు. తాను కూడా ఎంపీగా పోటీ చేసేందుకు ఓ నియోజకవర్గంలో కొంతకాలం పని చేశానని, అయితే తర్వాత ఆ నియోజకవర్గం వదులుకోవాల్సి వచ్చిందని స్వానుభవం వెల్లడించారు. పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారని, ఆ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. అభ్యర్థి విషయం పార్టీ అధ్యక్షుడు చూసుకుంటారని, ఆ విషయం ఆయనకు వదిలిపెట్టి తిరుపతిలో జనసేన గెలించేందుకు కష్టపడి పనిచేయాలని ఆయన తిరుపతి నాయకులను ఆదేశించారు.మంగళగిరి పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచీ సాయంత్రం 5.30 గంటల వరకూ సమావేశం కొనసాగగా పార్టీ పరిశీలకుడు అజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. దీంతో తిరుపతి జనసేన అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులే కొనసాగుతారా? లేక మార్పు వుంటుందా? అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే మిగిలిపోయింది. తిరుపతి నాయకులతో త్వరలో పవన్ కళ్యాణ్ సమావేశమయ్యేదాకా అభ్యర్థిపై నెలకొన్న సస్పెన్స్ ఇలాగే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

లోకేశ్‌తో ఆరణి భేటీ

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తిరుమలలో కలిశారు.టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆయన వెంట వున్నారు. అనంతరం శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను లోకేశ్‌కు వివరించా నన్నారు.స్థానిక నేతలతో మాట్లాడి తనకు సహకరించేలా చూడాలని అభ్యర్థించగా ఒకట్రెండురోజుల్లో పరిస్థితులు సర్దుకుంటాయని, జాగ్రత్తగా పనిచేసుకోండని లోకేశ్ సూచించినట్టు చెప్పారు.అనంతరం మరో బృందంగా టీడీపీ నాయకులు ఊకా విజయ్‌కుమార్, నరసింహ యాదవ్, పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్ తదితరులు లోకేశ్‌ను కలిశారు.

పోలీసుశాఖలో 20మందికి ఉగాది పురస్కారాలు

తిరుపతి(విద్య), మార్చి 21: తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 20 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వారిని ప్రభుత్వం ఏటా ఉగాది పురస్కారాలతో గౌరవిస్తుంది. వివిధ విభాగాల్లో పురస్కారాలకు ఎంపికైన వారు వీరే.

ఉత్తమ సేవా పతకాలు

సీఐ పి.జగన్‌మోహన్ రెడ్డి, తిరుపతి జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్,
ఏఆర్ఎస్ఐ ఎస్ఆర్ ఆంజనేయులు, వెంకటగిరి ఏపీఎస్పీ 9వ బెటాలియన్

కఠిన సేవా పతకం

కానిస్టేబుల్ ఎ.గోపాల్, తిరుపతి టాస్క్‌ఫోర్స్

సేవా పతకాలు

సీఐ కె.బాలయ్య, చిత్తూరు దిశ స్టేషన్
ఆర్ఎస్ఐ బి.లక్ష్మీపతి,వెంకటగిరి ఏపీఎస్పీ 9వ బెటాలియన్
డీఎస్పీ వి.శ్రీనివాసులు, తిరుపతి పీటీసీ వైస్ ప్రిన్సిపాల్
ఆర్ఎస్ఐ ఎం.చిరంజీవులు , తిరుపతి టాస్క్‌ఫోర్స్
ఏఎస్ఐ ఎం.జయచంద్ర శెట్టి, పుంగనూరు
హెడ్‌కానిస్టేబుల్ పి.మోహనయ్య , నింద్ర
హెడ్‌కానిస్టేబుల్ కేఎస్ నరేంద్ర కుమార్,చిత్తూరు ట్రాఫిక్
ఏఎస్ఐ సి.గోపాలరెడ్డి, తిరుపతి ట్రాఫిక్
ఏఎస్ఐ టి.సురేష్‌బాబు , తిరుపతి వెస్ట్
ఏఆర్ఎస్ఐ ఎస్.జయప్రసాద్‌బాబు, తిరుపతి
ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.ధనంజయులు, తిరుపతి
ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాసులు, తిరుపతి హోంగార్డ్స్ ఇంచార్జి
కానిస్టేబుల్ పి.శారద,ఎయిర్‌పోర్ట్ స్టేషన్, తిరుపతి
కానిస్టేబుల్ ఎం.నందకుమార్, తిరుపతి టాస్క్‌ఫోర్స్

ఉత్తమ సేవాపతకాలు (అగ్నిమాపక శాఖ)

ఫైర్ ఆఫీసర్ కె.శ్యాంబాబు, నాయుడుపేట
లీడింగ్ ఫైర్‌మెన్ వి.ఉమాపతి, పుత్తూరు

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సేవా పతకం

తిరుమల ఎస్ఐ జె.రామకృష్ణారావు.

ఒకే ఎపిక్ నంబరుతో రెండు జిల్లాల్లో ఓట్లు !



గూడూరు 10వ బూత్ ఓటరు జాబితాలో లక్ష్మీప్రసూన



నెల్లూరు రూరల్‌లోని 49వ బూత్ ఓటర్ల జాబితాలో లక్ష్మీ ప్రసూన

గూడూరు, మార్చి 21 : ఓటర్ల జాబితాలో అవకతవకలు ఇంకా బయటపడుతూనే వున్నాయి.తాజాగా ఒకే ఎపిక్ నెంబరుపై రెండు జిల్లాల్లో ఓట్లు నమోదై ఉండడాన్ని గూడూరు పట్టణంలోని వీరారెడ్డిపల్లి 10వ బూత్‌లో టీడీపీ నాయకులు గుర్తించారు. ఈ బూత్‌లో సీరియల్ నంబరు 1347లో ఎపిక్ నంబరు వైఏఈ 2399350పై లక్ష్మి పేరుతో ఒక ఓటు,సీరియల్ నంబరు 1039లో ఎపిక్ నంబరు జీఎల్‌డబ్ల్యు 2879500తో ప్రసూన పేరుతో ఒక ఓటు నమోదై వున్నాయి.నెల్లూరు జిల్లాలోనూ వీరిద్దరూ ఓటర్లుగా నమోదై వున్నారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వున్న కొత్తూరు ప్రాంతంలోని బూత్ నంబరు 49లోని ఓటర్ల జాబితాలో సీరియల్ నంబరు 1638లో ఎపిక్ నంబరు వైఏఈ 2399350పై లక్ష్మి పేరుతో ,సీరియల్ నంబరు 1644లో ఎపిక్ నంబరు జీఎల్‌డబ్ల్యు 2879500తో ప్రసూన పేరుతో ఓట్లు నమోదైవున్నాయి. ఈ విషయమై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని టీడీపీ మాజీ కౌన్సిలర్ ఇశ్రాయిల్‌కుమార్ చెప్పారు.

వైసీపీ సేవలో వలంటీర్

● విధుల నుంచి తొలగింపు



రేణిగుంట, మార్చి 21: వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఒక వలంటీరును ఉద్యోగం నుంచి తొలగించారు. శ్రీకాళహస్తిలోని వైసీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రేణిగుంట బుగ్గవీధికి చెందిన వలంటీరు మస్తాన్ ఆ ప్రాంతం నుంచి కొంతమందిని వైసీపీలో చేర్పించారు. అక్కడ దిగిన ఫొటోలు వైరల్ కావడంతో ఎంపీడీవోకు స్థానిక టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో మస్తాన్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఎంపీడీవో విష్ణు చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు, ఆర్టీసీ కండక్టర్





ఆర్వీకండ్రిగలో జరిగిన ప్రచారంలో వలంటీర్లు గీత, లత - వైసీపీ ప్రచారంలో కండక్టర్ మురళి

ఏర్పేడు మండలంలోని రావిళ్లవారికండ్రిగ పంచాయతీలో గురువారం సాయంత్రం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో రావిళ్లవారికండ్రిగ పంచాయతీకి చెందిన వలంటీరు కాటా గీత, పెమ్మిగారి లత, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో కండక్టర్ మురళి పాల్గొనడం చర్చనీయాంశమైంది.

- ఏర్పేడు

తిరుచానూరు ఆలయంలో క్యూకాంప్లెక్సు పనుల ప్రారంభం

తిరుచానూరు, మార్చి 21 : శ్రీవారి దేవేరి పద్మావతీ దేవి కొలువైన తిరుచానూరులో అత్యాధునిక క్యూకాంప్లెక్సు పనులు మొదలయ్యాయి.గత నెల క్యూకాంప్లెక్సు టెండర్‌ను దక్కించుకున్న కంపెనీ పనులు ప్రారంభించింది. పాత డిప్యూటీ ఈవో కార్యాలయ భవన సముదాయంలో ఈ క్యూకాంప్లెక్సును నిర్మించనున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా 0.75ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాత డిప్యూటీ ఈవో కార్యాలయం, కల్యాణమండపం సముదాయాన్ని తొలగిస్తున్నారు.మూడంతస్తులతో క్యూకాంప్లెక్సు నిర్మాణం జరగనుంది. సెల్లార్‌లో లాకర్లు, సెల్‌ఫోన్, పాదరక్షల కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులకు టిక్కెటు కౌంటర్లు, సెక్యూరిటీ పాయింట్ వస్తాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో వెయిటింగ్ హాల్, కల్యాణకట్ట రానుంది. ఇంకో అంతస్తులో క్యూలైన్, వెయిటింగ్ హాల్ రానుంది.నాల్గవ గేట్ వద్ద నిర్మించనున్న ఈ క్యూకాంప్లెక్సులోకి భక్తులు ప్రవేశించిన తరువాత లగేజీలను అక్కడే భద్రపరచుకుని ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనానికి వెళతారు.అమ్మవారి ఉత్సవాల సమయంలో వాహనసేవలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు దర్శనానికి వెళ్లేందుకు మూవింగ్ బ్రిడ్జిని పాత పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మించనున్నారు.

పెంచలకోనకు నేడు చంద్రబాబు

● నృసింహుడిని దర్శించుకోనున్న టీడీపీ అధినేత

డక్కిలి, మార్చి 21 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు మండలంలో వున్న పెంచలకోనలో లక్ష్మీనృసింహుడిని దర్శించుకోనున్నారు.శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు బయలుదేరి 3.15 గంటలకు గోనెపల్లెకు చేరుకుంటారు.అక్కడి నుంచి రోడ్డుమార్గాన పెంచలకోనకు చేరుకుని, లక్ష్మీనృసింహుడిని దర్శనం చేసుకుంటారు. తిరిగి సాయంత్రం 4.30 గంటలకు గోనెపల్లెకు చేరుకుని హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళతారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్ నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గోనుపల్లెలో పర్యవేక్షిస్తున్నారు.

24, 25 తేదీల్లో కుప్పం పర్యటన

కుప్పం, మార్చి 21: ఈనెల 24, 25 తేదీల్లో టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటన ఖరారైంది. సొంత నియోజకవర్గం నుంచే ఆయన ఎన్నికల ప్రచారం మొదలుపెట్టనున్నారు.కచ్చితమైన షెడ్యూల్ నిర్ధారణ కాకున్నా చంద్రబాబు ఈ రెండ్రోజుల్లో సుడిగాలి పర్యటన చేయనున్నట్లు తెలిసింది. రోడ్ షోలలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం): సా. 6.27
సహరి (శనివారం) : ఉ. 4.56

ఎన్నికలంటే అంత చులకనా?

● సమాచార శాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21: 'ఏం తమాషాలు చేస్తున్నారా... ఎన్నికలంటే మీకు అంత చులకనా.. విధుల్లో ఉన్న సిబ్బంది ఎక్కడ' అంటూ కలెక్టర్ లక్ష్మీశ సమాచార శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థుల ప్రచారం, మీడియాకు సంబంధించి నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలను పరిశీలించే మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. పలువురు సిబ్బంది విధుల్లో కన్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇదేనా మీ పనితీరు' అంటూ కోపోద్రిక్తులయ్యారు. ఇలాగే వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరుపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

30మందికి షోకాజ్ నోటీసులు

గురువారం జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. తరగతులకు హాజరుకాని 30మంది పీవో, ఏపీవోలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు వారికి షోకాజ్ నోటీసులు పంపించారు. వారినుంచి సంతృప్తికరమైన వివరణ రాకపోతే కఠిన చర్యలు ఉండే అవకాశముంది.



ఎంసీఎంసీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యం



బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాశం సునీల్‌కుమార్, బీజేపీ, జనసేన నాయకులు

గూడూరు, మార్చి 21: రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక రెండోపట్టణ పరిధిలోని విందూరు రోడ్డులో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుక బడిందన్నారు. మళ్లీ రాష్ట్రం బాగుపడాలంటే ఉమ్మడి ప్రభుత్వం రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చంద్రప్ప, పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, గిరిరెడ్డి, పనబాక కోటేశ్వరరావు, మనోజ్‌కుమార్, చంద్రమౌళి, రవీంద్రరెడ్డి, తీగల చంద్రశేఖర్, ఇంద్రవర్ధన్, నరసింహులు, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య, వెంకటేశ్వర్లురాజు, బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ట్యాంకరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

గూడూరు అర్బన్, మార్చి 21: పట్టణంలో నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడం ప్రజలు నీటి కోసం అవస్థలుపడాల్సివచ్చింది. కండలేరు నుంచి గూడూరుకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందించారు.

మున్సిపాలిటీని ముట్టడిస్తాం

పైపులైన్లు త్వరగా బాగుచేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని లేనిపక్షంలో టీడీపీ ఆధ్వ ర్యంలో ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. నాలుగు రోజులుగా జనం తాగునీటికోసం అవస్థలు పడుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



చంద్రశేఖరపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

కోట, మార్చి 21 : మండల పరిధిలోని గూడలి పంచాయతీలో గల చంద్రశేఖరపురంలో గురువారం కోటకు చెందిన ప్రగతి డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో విద్యార్థులు పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రంచేశారు. డ్రైనేజీ కాలువల్లో బ్లీచింగ్ చల్లి అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకయ్య పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



డక్కిలిలో కేంద్ర సాయిధ బలగాలతో కవాతు

డక్కిలి, మార్చి 21 : ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ చౌడయ్య కోరారు. ఎన్నికల నేపథ్యంలో గురువారం డక్కిలిలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించామన్నారు. డక్కిలి పోలీసుస్టేషన్ నుంచి పాతబస్టాండు సెంటరు, మార్లగుంట వరకు కవాతు సాగింది.

స్త్రీ, శిశు మరణాలు నివారించాలి

బాలాయపల్లి, మార్చి21: స్త్రీ, శిశు మరణాలు తగ్గించడమే పోషణ పక్వాడ ఉద్దేశమని అంగన్వాడీ పర్యవేక్షకురాలు రాజేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని నాయుడుచెరువు కండ్రిగ గ్రామంలో బాలింతలకు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారం తీసుకోకుంటే కలిగే నష్టాలను తెలియజేశారు. అనంతరం ఇళ్లలో ఉండే వస్తువులతో పిండి పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శారద తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరగాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు అర్బన్, మార్చి 21: ఎన్నికలు సజావుగా జరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలన్నారు. మద్యం రవాణా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వస్తువులు పంపిణీ చేయకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఈ శిక్షణా తరగతులను డిప్యూటీ కలెక్టర్ సీఎన్ నాయుడు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కరుణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



డక్కిలి, మార్చి 21 : డక్కిలిలో ఏర్పేడు -వెంచలకోన జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలను గురువారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీచేసింది. డక్కిలి సమీపంలోని చెరువు కట్టపై వాహనాలు ఆపి తనిఖీ చేశారు. రూ 50 వేలకు మించి నగదు ఉంటే ఆధారాలు చూపాలని లేనిపక్షంలో సీజ్ చేస్తామని స్క్వాడ్ అధికారి జగదీష్‌బాబు తెలిపారు.

ఎన్నికలు పక్కాగా నిర్వహించాలి

వెంకగటగిరిటౌన్, మార్చి 21: వచ్చే సార్వత్రిక ఎన్నికలు పక్కాగా నిర్వహించాలని తిరుపతి జిల్లా జేసీ, వెంకటగిరి ఆర్వో ధ్యానచంద్ర అన్నారు. గురువారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళశాలలో ఏపీవో, పీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లిలోని 398 మంది పీవోలు, ఏపీవోలైన అధికారులకు శిక్షణ అందించామన్నారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు.

ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

వెంకటగిరిటౌన్, మార్చి 21: ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఫలితంగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పాఠశాలలు నిర్వహించాల్సి వస్తోందన్నారు. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిసిందని అలా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ప్రకృతికుమార్

వెంకటగిరిటౌన్, మార్చి 21: పట్టణంలోని బంగారు పేటకు చెందిన దివ్యాంగుడైన గౌరబత్తిన వీరభద్రయ్యకు ఏపీపీ ప్రకృతికుమార్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సోమయ్య ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 17న విజయనగరంలో జరిగిన దివ్యాంగుల పారా సిట్టింగ్ వాలీ బాల్ పోటీల్లో వీరభద్రయ్య విజేతగా నిలిచారు. త్వరలో రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొన నున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేష్, మురళి, రాజా పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించండి

బాలాయపల్లి, మార్చి21: ఎన్నికల నియమావళిని సచివాలయ సిబ్బంది కచ్చితంగా పాటించాలని ఎంపీడీవో అరుణ సూచించారు. గురువారం మండలంలోని ఊట్లపల్లి, కోటంబేడు, చిలమనూరు, హస్తకావేరి గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలు తీరును పరిశీలించారు.

దళిత ద్రోహి జగన్ : టీడీపీ



ఎస్సీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, మార్చి 21: వైఎస్.జగన్ దళిత ద్రోహి అని వెంకటగిరి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్సీల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్సీల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ అధికారంలోకి వచ్చాక ఎస్సీలను అన్నివిధాలా ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఎస్సీలకు సంబంధించిన పలు పథకాలు రద్దుచేశార న్నారు. చంద్రబాబు హయాంలోనే ఎస్సీలకు అన్నివిధాలా న్యాయం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఇంటి బిడ్డగా తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరసారత్నం నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి పట్టణం, వెంకటగిరి, డక్కిలి, రాపూరు, సైదాపురం, బాలాయపల్లి మండలాల ఎస్సీ సెల్ నాయకులను, కార్యకర్తల, జనసేన పార్టీ నాయకులను ఆమెకు పరిచయం చేశారు. జగన్ ప్రభుత్వంలో ఎస్సీలకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించాలని ఆమె వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు శ్రీరామదాసు గంగాధర్, చెంగారావు, మల్లారం బాబు, మచ్చల వేణు, రాపూరు శ్రీనివాసులు, సుధ, రవి, చలపతి తదితరులు ఉన్నారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరును పూర్తిచేయండి



మాజీ ఎమ్మెల్యే రామకృష్ణను సత్కరిస్తున్న రైతులు

డక్కిలి, మార్చి 21 : వైసీపీ ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసిన ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణాన్ని అధికారంలోకి రాగానే పూర్తి చేయించాలని ఆల్తూరుపాడు గ్రామ రైతులు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణని కోరారు. టీడీపీ అభ్యర్థిగా లక్ష్మీ సాయిప్రియను ఖరారు చేసిన సందర్భంగా గురువారం వారు ఆమెను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆల్తూరుపాడు గ్రామంలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా చెరువు కట్టను పూర్తిగా తొలగించడంతో చెరువులో నీరు నిల్వచేసుకోలేకపోతున్నామని చెప్పారు. ఫలితంగా నాలుగేళ్ల నుంచి పంటలు పండించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే రిజర్వాయరు పనులు మొదలు పెడతామని రామకృష్ణ వారికి హామీ ఇచ్చారు.

ప్రతి ఓటరునీ కలుద్దాం..గెలుద్దాం: టీడీపీ



ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహిస్తున్న లక్ష్మీ సాయిప్రియ

డక్కిలి, మార్చి 21 : గెలుపే లక్ష్యంగా యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బూత్‌లెవల్లో పనిచేయాలని వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ అన్నారు. గురువారం ఆమె మండలంలోని బూత్ లెవల్ యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటరును నేరుగా కలిసి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, ఆ పార్టీ నేతల అరాచకాలను వివరించాలని చెప్పారు. కార్యకర్తలే పార్టీకి కొండంత బలమన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పటిష్టంగా ఉందన్నారు. తన తండ్రి రామకృష్ణ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తుచేయాలన్నారు. చంద్రబాబు విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజల్లో విస్తృత ప్రచారం జరగాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం ఆమె గ్రామాల వారీగా పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పప్పు చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ విజయం చారిత్రక అవసరం



నెలవల, వేనాటితో కలిసి మాట్లాడుతున్న అభ్యర్థి విజయశ్రీ

సూళ్లూరుపేట, మార్చి 21: భావి తరాల ఉజ్వల భవిష్యత్తు, రాష్ట్ర ప్రగతి కోసం చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ విజయం చారిత్రక అవసరమని మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం అన్నారు. గురువారం సూళ్లూరుపేటలో టీడీపీ అధికార ప్రతినిధి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను కలిసి విద్యావంతులు, యువత ఆలోచించి రాష్ట్ర భవిష్యత్ కోసం ఓటు వేయాల న్నారు. రాష్ట్రంలో పాలన గాడిలో పడాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నారు. రాక్షస పాలనను అంతం చేసే అవకాశం అందరికీ వచ్చిందని ఈ ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని వేనాటి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, బండారు ఆంజనేయులు, మేడా సాయినారాయణ, వేనాటి జనార్ధన్ రెడ్డి, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

సూళ్లూరుపేట, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రముని ఆధ్వర్యంలో, నోడల్ అధికారి చెంగయ్య పర్యవేక్షణలో అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్ (ఏఎల్ఎంటీ) వారిచే పోలింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చారు. ఉదయం సూళ్లూరుపేట పట్టణం, సూళ్లూరుపేట మండలం, తడ, దొరవారిసత్రం మండలాలు, మధ్యాహ్నం నాయుడుపేట పట్టణం, నాయుడుపేట మండలం, పెళ్ల కూరు, ఓజిలి మండలాలకు చెందిన పోలింగ్ అధికారులతో సహాయ పోలింగ్ సిబ్బంధికి ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ కల్పించారు. ఈ సంద ర్భంగా ఈవీఎంలపై ప్రాక్టికల్ శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బోరు మోటారు చోరీ

చిల్లకూరు, మార్చి 21: మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన రైతు రాధాకృష్ణారెడ్డి వేరుశనగ పొలంలోని వ్యవసాయ బోరు మోటారును గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు గుర్తించి రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోటారు విలువ రూ.15వేలు చేస్తుందని తెలియజేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామరాజ్యం రావాలంటే బాబు సీఎం కావాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, మార్చి 21 : అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం రామరాజ్యం కావాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధి లోని కొక్కుపాడు పంచా యతీలో గల తిమ్మనాయుడు పాళెం గిరిజన కాలనీలో గురు వారం రాత్రి టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథ కాల ను వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ క్యాలెండర్లను ఆవిష్క రించారు. అనంతరం ఆయా నాయకులు మాట్లాడుతూ బాబు ప్రవేశపెట్టిన ఎస్సీ కార్పొ రేషన్లు, ఎస్సీ, ఎస్టీలకు ఉపయోగపడే పలు పథకాలను సీఎం జగన్ రద్దు చేశారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రాకపోవడంతో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు సీఎం అయితేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. అలాగే పాశం సునీల్ కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, వెంకటకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వాకా విజయభాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మధుయాదవ్, మురళీ, శ్రీహరి, బాలాజీశెట్టి, తీగల సురేష్‌బాబు, బాలకృష్ణ యాదవ్, పోలయ్య, అనిల్, నాగభూషణం., కోటేశ్వరరావు, షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ : కమిషనర్



కమిషనర్ జనార్ధన్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, మార్చి 21: నాయుడుపేట మున్సిపాలిటీలోని ప్రజలు స్థిరాస్తుల పన్నులు, నీటి కొళాయి పన్నులు మార్చి లోపు చెల్లిస్తే ఎటువంటి వడ్డీలు చెల్లించన క్కరల్లేదని మున్సిపల్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆస్తి, కొళాయిలకు సంబంధించి పన్ను బకాయిలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైక్ నుంచి జారిపడిన మహిళ మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 21 : ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. మేనకూరు గ్రామానికి చెందిన దొరస్వామి - హైమావతి (27) దంప తులు. వీరు తమ చంటిబిడ్డకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో ఈనెల 19వ తేదీ మోటారు సైకిల్‌పై నాయుడుపేటకు బయలు దేరారు. నాయుడు పేట సమీపంలో పార్కు వద్ద వెళుతుండగా హైమావతి చీరకొంగు మోటారు సైకిల్ వీలులో చిక్కుకోవడంతో అదుపుతప్పి ముగ్గురూ కిందపడ్డారు. ఆ సమయంలో పాపకు ఎలాంటి గాయాలూ కాలేదు. దొరస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే హైమావతి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతిచెందింది.

ఆటో - మోటారు బైక్ ఢీ

● కార్మికులకు గాయాలు

కోట, మార్చి 21 : కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డు వద్ద గురువారం ఆటో, మోటారు బైక్‌ఢీ కొన్న సంఘటనలో పలువురు కార్మికులకు స్వల్పగాయాల య్యాయి. క్రాస్‌రోడ్డు నుంచి పలువురు మహిళా కార్మికులు ఓ పరిశ్రమకు వెళ్లేందుకు ఆటోలో గూడూరు వైపు వెళ్తున్నారు. విద్యానగర్ నుంచి మోటారు సైకిల్ ఎదురుగా వచ్చి క్రాస్‌రోడ్డు వద్ద కార్మికులతో వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో పలువురు కార్మికులకు స్వల్ప గాయాల య్యాయి. ఆటో ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది.

రోడ్డుపై ధాన్యం రాశి.. బైక్ బోల్తా ఇద్దరికి గాయాలు

వాకాడు, మార్చి10: రోడ్డుపైనున్న ధాన్యం రాశిపైకి బైకు ఎక్కడంతో అదుపు తప్పింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ పవన్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని వడ్డిపాళెం వద్ద రోడ్డుపై గ్రామానికి చెందిన వారు వరిధాన్యం రాశిగా పోసి ఉంచారు. ధాన్యంపై నల్లటి పట్ట కప్పి ఉంచారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు పాల డెయిరీలో కృష్ణ, నరేష్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. వీరు గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కోడివాక గ్రామంలోని ఓ పాల ఉత్పత్తి కేంద్రంలో మెషీన్‌ను బాగుచేయడానికి బయలుదేరారు. రాత్రి కావడంతో వడ్డిపాళెం వద్ద ధాన్యం రాశిని గుర్తించలేకపోయారు. వాహనాన్ని ధాన్యం రాశిపై ఎక్కించేశారు. వాహన అదుపుతప్పడంతో తలకు గాయాలయ్యాయి. వాకాడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

సూళ్లూరుపేట, మార్చి 21: సూళ్లూరుపేటలోని సూళ్లూరులో గురువారం అపాచి కంపెనీలో పనిచేసే చింతబత్తిన నవ్యశ్రీ (21) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం దొండపాడు గ్రామానికి చెందిన నవ్యశ్రీ తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడలోని అపాచి కంపెనీలో పనిచేస్తోంది. సూళ్లూరులో అద్దె ఇంట్లో అదే కంపెనీలో పనిచేసే తన స్నేహితులతో కలిసి ఉండేది. గురువారం ఆమె గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబును విమర్శిస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 21 : టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శిస్తే సహించబోమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి హెచ్చరించారు. పెళ్లకూరులో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో నిర్వహించారు. ఇందో మురళీకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సొంతపార్టీ నేతలే ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని విమర్శిస్తున్నారని దానిని సరిదిద్దుకోలేక తమ అధినేతను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలు పుణ్య క్షేత్రాల్లా కొలిచే శిరసనంబేడు, రోసనూరు కొండలను వైసీపీ నాయకులు గుల్ల చేశారని విమర్శించారు. కోడ్ అమల్లోకి వచ్చినా ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఆగలేదన్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారని దీనిపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. సత్యనారాయణరెడ్డి ఎన్నిఎత్తులు వేసినా ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించు కుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌నాయుడు, పేరం మధుసూదన్ నాయుడు, దామెర ప్రసాద్‌నాయుడు తదితరులు ఉన్నారు.